
ప్రజా పరిచయ వేదిక
వృత్తిలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని,
ప్రతి నిమిషం ప్రజాసేవకై పరితపిస్తూ.. ఎన్నో సందర్భాలలో పేద,
బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికై కృషి చేస్తూ...
శ్రీ దగ్గుమళ్ళ ప్రసాదరావు గారు IRS
(చిన్న బుజ్జి) గారు ప్రజలకు మరింత సేవ చేయాలనే దృఢ సంకల్పంతో,
ఎన్టీఆర్ గారి స్ఫూర్తి, శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి
ఆశయ సాధనకై మన ముందుకు వస్తున్న సందర్భముగా వారికి
ఇవే మా హృదయపూర్వక శుభాకాంక్షలు
అందరికీ
ఆత్మీయ ఆహ్వానము
ది. 13-01-2024
ఉదయం 10.00 గం.లకు
మన బాపట్లలోని
విలియం బూత్ జూనియర్ కళాశాల ప్రక్కన,
క్రిస్టియన్ భవన్
ఆవరణములో
దేవతోటి సుందరయ్య
టిడిపి రాష్ట్ర యస్.సి.సెల్ ప్రధాన కార్యదర్శి, చీరాల
దేవతోటి నాగరాజు
పర్చూరు నియోజకవర్గ టిడిపి యస్.సి.సెల్ ప్రధాన కార్యదర్శి
జంగం రాజశేఖరరావు
విశ్రాంత సి.ఇ.ఓ. సంతరావూరు
జంగం ప్రవీణ్
బాపట్ల పార్లమెంటు టిడిపి క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు
పెనుమాల డేవిడ్
బాపట్ల పార్లమెంటు టిడిపి యస్.సి.సెల్ అధికారప్రతినిధి
చుక్కా కోటయ్య
రేపల్లె నియోజకవర్గ టిడిపి యస్.సి.సెల్ అధ్యక్షులు
పల్లం సరోజినీ
టిడిపి బాపట్ల పార్లమెంటు మహిళా ప్రధాన కార్యదర్శి
కూచిపూడి ఝాన్సీరాణి
టిడిపి బాపట్ల పార్లమెంటు కార్యదర్శి
ఇట్లు :
బాపట్ల పార్లమెంట్ తెలుగుదేశంపార్టీ నాయకులు,
కార్యకర్తలు మరియు అభిమానులు

కలర్‌ఫుల్ : రంగులమయమైన నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని టెన్నిస్ కోర్టు



హరివిల్లు.. సిరిజల్లు..

వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం విజయవాడలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ

గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



పరిశీలన : ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

ద్వితీయ బహుమతి విజేతలు

ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే.

- ఏ.సునీత, గుంటూరు జిల్లా

రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.

- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా

పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

- రాధ, తమిళనాడు



విజేతలు వీరే..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ద్వితీయ బహుమతులు అందుకుంటున్న ఏ.సునీత (గుంటూరు), కె.ఉమాదేవి (అనంతపురం), కె.రాధ (తమిళనాడు), కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆదిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), సీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక)

మిర్చియార్డులో హమాలీల ఆందోళన

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మిర్చియార్డులో హమాలీలు మెరుపు ఆందోళనకు దిగారు. గురువారం మధ్యాహ్నం రైతులు తమకు ఇచ్చిన మచ్చుకాయలను బయటకు తీసుకెళుతుంటే 60 ఏళ్ల వయస్సు పైబడిన ముఠా కార్మికుడిపై ఇద్దరు మహిళా సెక్యూరిటీ సిబ్బంది భౌతికంగా దాడి చేసి లాక్కొన్నారని ఆరోపిస్తూ గుంటూరు - హైదరాబాద్ జాతీయ రహదారిని గంటకు పైగా దిగ్బంధించారు. ఈ సందర్భంగా యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైసీపీ నేతలపై తిట్ల దండకం అందుకొని యార్డు పరిసరాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ప్రదర్శనగా వచ్చి యార్డు పరిపాలన భవనం వద్ద ఆందోళనకు దిగారు. ఈక్రమంలో వీరికి కొంతమంది అసాంఘిక శక్తులు జత కలిసి అక్కడ ఉన్న సెక్యూరిటీ సిబ్బంది, అటెండర్లపై చేయి చేసుకొన్నారు. మార్కెటింగ్ అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్న ఆఫీసుల వద్దకు వెళ్లి తలుపులపై చేతులతో బాదుతూ లోనికి చొచ్చుకొని వెళ్లే ప్రయత్నం చేశారు. అదే సమయంలో పోలీసులు అక్కడికి వచ్చి వారిని వారించి బయటకు పంపేశారు. అనంతరం మార్కెటింగ్ విజయవాడ రీజియన్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు వద్ద ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు చర్చలు జరిపారు. యార్డులో ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది తమని దొంగల్లా చూస్తున్నారని, షాపులలోకి వచ్చి అన్ని శోధిస్తున్నారని, నానా దుర్భాషలాడుతున్నారని ఆరోపించారు. దీనిపై జేడీ శ్రీనివాసరావు స్పందిస్తూ యార్డు అనేది రైతుల శ్రేయస్సు కోసం ఏర్పాటు చేసింది. ఇక్కడ రైతుకు నష్టం జరగడానికి వీలులేదు. మచ్చుకాయలు ఎవరూ తీసుకొన్నా చట్టరీత్యా నేరం. కావాలంటే మచ్చు కూలీ పెంచమని కోరితే చర్చలు జరిపి నిర్ణయం తీసుకొంటాం. అంతే తప్పా ఇలా ఆఫీసులపై దాడి చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది ఎవరైనా అమానుషంగా ప్రవర్తిస్తే వారిపై చర్యలు తీసుకొంటామన్నారు.

విద్యుత్‌విజిలెన్స్ బృందాల తనిఖీలు

● 261 మందికి రూ. 14.09 లక్షల అపరాధ రుసుం

గుంటూరు, జనవరి 11: విద్యుత్ విజిలెన్స్ , ఆపరేషన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఈఈ (డీపీఈ) కె సూర్యప్రకాష్ , గుంటూరుటౌన్-1 డివిజన్ ఆపరేషన్‌ఈఈ టి శ్రీనివాసబాబు ఆధ్వర్యంలో గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. 56 మంది అధికారులు, 168 మంది సిబ్బంది, 56 బృందాలుగా ఏర్పడి పెదకాకాని, వెనిగండ్ల, అగర్తవరపాడు, నంబూరు, ఐజెఎమ్ , ఉప్పలపాడు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు డీపీఈ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3837 సర్వీసులు తనిఖీ చేసి అనుమతి లేకుండా నేరుగా విద్యుత్ చౌరానికి పాల్పడుతున్న 261 మందికి రూ. 14.09 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు పేర్కొన్నారు. విద్యుత్ చౌర్యం నేరమని, చౌర్యానికి పాల్పడే వారిపై 9440812263, 9440812360కు ఫిర్యాదులు చేయాలని కోరారు.

14న గుంటూరు మీదగా నరసపూర్ - హైదరాబాద్ రైలు

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14వ తేదీన గుంటూరు మీదగా నరసపూర్ - హైదరాబాద్ ప్రత్యేక రైలుని నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో సీహెచ్ రాకేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెంబరు 07177 నరసపూర్ - హైదరాబాద్ రైలు ఆదివారం సాయంత్రం 6 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదగా మరుసటి రోజు వేకువజామున 4.50కి హైదరాబాద్ చేరుకుంటుందన్నారు.

ఆరు రైళ్లకు అదనపు భోగీలు

ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా శబరి, రాయగడ, తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లకు రెండు వైపులా అదనపు భోగీలు జోడిస్తున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు. శబరి ఎక్స్‌ప్రెస్‌కి ఒక ఏసీ త్రీటైర్, రాయగ ఎక్స్‌ప్రెస్‌కి ఒక జనరల్ సిట్టింగ్, తిరుపతి ఎక్స్‌ప్రెస్‌కి మూడు జనరల్ సిట్టింగ్ భోగీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఉద్యోగ ఉపాధికి నిలయం అమరావతి

1486 వ రోజుకు చేరుకున్న ఆందోళనలు



వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు ,రైతులు

తుళ్లూరు జనవరి 11: రాష్ట్ర యువతకు ఉద్యోగ , ఉపాధి నిలయంగా అమరావతి రాజధాని ఉండేది మూడు ముక్కల ఆటతో అందరికి నిరాశే మిగిల్చారని , 33వేల ఎకరాలు రాజధాని నిర్మాణానికిచ్చిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు,నిరసనలు దీక్షలు గురువారం నాటికి 1486వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుండి వారు మాట్లాడుతూ , ఆంధ్ర రాష్ట్ర ఏకైక రాజధాని అమరావతేనని ఒక్క అంగుళం కూడా కదల్చలేరని అన్నారు. ఐదు కోట్ల మంది అంగీకరించిన రాజధాని అమరావతి అని స్పష్టం చేశారు. పాలకుల సొంత ప్రయోజనాల కోసం ఆడుతున్న మూడు ముక్కల ఆటకు ప్రజలు వ్యతిరేకమన్నారు. తాము చేసిన పాద యాత్రలకు వచ్చిన స్పందనతో అమరావతిపై ప్రజలకు ఎంత అభిమానం , ఆప్యాయత ఉందో సీఎం జగన్‌రెడ్డి తెలుసుకోవాలన్నారు. అమరావతిని అభివృద్ధి చేయకుండా నాశనం చేయటానికే ఎక్కువ సమయం పాలకులు కేటాయించటం దుర్మార్గమన్నారు. ఉన్నత న్యాయస్థానం తీర్పును అనుసరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సంపద అమరావతిని నాశనం చేయవద్దన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

జడ్పీ స్టాండింగ్ కౌన్సిల్ గా 'వేముల'



జయపాల్‌కు నియామకపు ఉత్తర్వులు అందజేస్తున్న జడ్పీ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు సిటీ, జనవరి 11:గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ స్టాండింగ్ కౌన్సిల్ గా ప్రముఖ న్యాయవాది వేముల జయపాల్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఆయనకు నియామకపు ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుంటూరు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి, అడ్వకేట్ ప్యానెల్ ప్రతిపాదించిన న్యాయ వాదుల నుండి ఒకరిని స్టాడింగ్ కౌన్సిల్ గా ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లా పరిషత్ సంబంధించిన కేసులు అన్నింటిని సమర్ధవంతముగా వాదించి విజయాన్ని సాధించాలని జడ్పీ ఛైర్ పర్సన్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

13 నుంచి 16 వరకు మిర్చియార్డుకు సెలవులు

గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రెండో శనివారం, సంక్రాంతి పండగ దృష్ట్యా ఈ నెల 13వ తేదీ నుంచి 16వ తేదీ వరకు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మిర్చియార్డుకు సెలవులు ప్రకటించినట్లు మార్కెటింగ్ జేడీ కాకుమాను శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఈ నెల 17వ తేదీన బుధవారం యార్డులో లావాదేవీలు పునఃప్రారంభమౌతఆయని చెప్పారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	91, 99, 110
చికెన్ విత్ స్కిన్	176.00
చికెన్ స్కిన్ లెస్	186.00



నీటిలో నానుతున్న శనగ పైరు (ఫైల్)

- మిచౌంగ్‌తో మునిగిన రైతులు
- 4.26 లక్షల ఎకరాల్లో పంట నష్టం
- నష్టంపై ప్రభుత్వానికి వెళ్లిన నివేదికలు
- రోజులు గడుస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం

పరిహారం.. ఎప్పటికో?

మిచౌంగ్ ముంచి రోజులు గడుస్తున్నా.. రైతులకు పరిహారంపై ప్రభుత్వం మౌనం వీడటంలేదు. తుఫాన్ కారణంగా చేతికందే దశలోని, కొత్త దశలోని పంటలు పూర్తిగా వర్షార్పణమయ్యాయి. రోజుల తరబడి పంట చేలు వర్షపు నీటిలోనే ఉండటంతో రైతులు నిండా మునిగిపోయారు. ఇటు జిల్లా అధికారులు.. అటు కేంద్ర బృందం పంట నష్టం అంచనాలపై పర్యటించి ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఆలస్యంగా అయినా పంట నష్ట పరిహారం అందుతుందని ఆశించిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వ తీరుతో నిరాశకు గురవుతున్నారు. నెల రోజులు అవుతున్నా ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం ఊసే లేకపోవడంపై బాధిత రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 4.26 లక్షల ఎకరాల్లో పంట నష్టం వివరాలు ప్రభుత్వానికి వెళ్ల రోజులు గడుస్తున్నా పరిహారం కోసం రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు.



మిర్చిపైరులో నిలిచిన నీరు (ఫైల్)

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రైతుల రెక్కల కష్టం మిచౌంగ్ తుఫాన్ తుడిచిపెట్టేయగా.. పాలకులు పరిహారం గురించి పట్టించుకోకుండా రైతులను పరిహసిస్తున్నారు. తుఫాన్ ఆనవాళ్లు చెదిరిపోయినా నష్ట పరిహారం ప్రభుత్వం నుంచి అందలేదని రైతులు వాపోతున్నారు. ఇంటికి చేరాల్సిన పంటలను వర్షం ముంచేయగా.. ప్రభుత్వం పరిహారం అందజేయకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. భారీ వర్షాలు, పెనుగాలులు చుట్టేయడంతో రైతులు నిండా మునిగిపోయినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు మిచౌంగ్ తుఫాను తీవ్ర నష్టం కలిగించింది. రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. మిచౌంగ్ తుఫాన్ పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలకు తీవ్ర నష్టం కలిగించింది. ముఖ్యంగా వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావమే చూపింది. చెరువులను తలపించేలా పొలాలు మునిగిపోయాయి. వరి, పత్తి, శనగ, మొక్కజొన్న, మినుము, పొగాకు తదితర పంటలకు అపార నష్టాన్ని కలిగించాయి. మిరప, అరటి, బొప్పాయి, పండ్లు, పూల తోటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టాలను నమోదు చేశారు. ప్రాథమిక అంచనాల అనంతరం పూర్తి వివరాలను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఇన్‌పుట్ సబ్సిడీకి వ్యవసాయ, ఉద్యాన శాఖలు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాయి. కేంద్ర బృందం పరిశీలన పూర్తై రోజులు గడుస్తున్నది. అయితే ఇంత వరకు రైతులకు పంట నష్ట పరిహారం గురించి ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. పరిహారం ఎప్పుడు వస్తుందా అని రైతులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలని కోరుతున్నారు. భారీ వర్షాలు రైతులను కోలుకోలేకుండా దెబ్బతీస్తే ఆదుకోవాల్సిన ప్రభుత్వం కూడా పట్టీపట్టనట్టుగా వ్యవహరిస్తుండం తమను దగా చేయడమేనని రైతులు వాపోతున్నారు.



నీటిలో మునిగివున్న వరి చేను (ఫైల్)

బాపట్ల జిల్లాలో..

సముద్ర తీర ప్రాంతానికి సమీపంలో ఉన్న బాపట్ల జిల్లాను మిచౌంగ్ తుఫాన్ వణికించింది. జిల్లా పరిధిలో పంటలకు అపార నష్టం వాటిల్లింది. 2.68 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిని రైతులు దారుణంగా నష్టపోయారు. వరి పంటకు భారీగా నష్టం వాటిల్లింది. వరి 1.97 లక్షల ఎకరాలు, శనగ 29,750 ఎకరాలు, మినుము 3,605 ఎకరాలు, పొగాకు 14,472 ఎకరాలు, మొక్కజొన్న 9,172 ఎకరాల్లో నష్టం జరిగినట్లు అధికారులు లెక్కలు కట్టారు. ఉద్యాన పంటలకు 14,030 ఎకరాల్లో నష్టం వాటిల్లగా ఇందులో మిర్చి 10,315 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు తేల్చారు.

గుంటూరు జిల్లాలో ..

మిచౌంగ్ తుఫాన్ కారణంగా గుంటూరు జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. జిల్లాలో పంటలకు భారీ నష్టం వాటిల్లింది. 1,21,400 ఎకరాల్లో పంటలు దెబ్బతినడంతో రైతులు కోలుకోలేని విధంగా నష్టపోయారు. ప్రధానంగా వరి పంటకు ఎక్కువగా నష్టం జరిగింది. వరి 93,850 ఎకరాల్లో దెబ్బతిన్నది. పత్తి 2,550 ఎకరాలు, మినుము 4,397 ఎకరాలు, శనగ 16,930, పొగాకు 2,430 ఎకరాలు, వెయ్యి ఎకరాల్లో జొన్న, 243 ఎకరాల్లో మొక్కజొన్న, 16,507 ఎకరాల్లో మిరప, 1,497 ఎకరాల్లో అరటి, 1,225 ఎకరాల్లో పూలు, కూరగాయలు, తమలపాకు తోటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు పంపారు.



పొగాకు చేలో నీరు (ఫైల్)

పల్నాడు జిల్లాలో..

పల్నాడు జిల్లాలో 36,725 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. 2,356 ఎకరాల్లో మిరప పంటకు నష్టం వాటిల్లింది. 10,605 ఎకరాల్లో శనగదెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ నిర్ధారించింది. 9,859 మంది రైతులను బాధితులుగా గుర్తించారు. పంట నెలరోజుల వ్యవధిలోనే దెబ్బతినడంతో ఇన్‌పుట్ సబ్సిడీ పరిధిలోకి రాదని వ్యవసాయ శాఖ వెల్లడించింది. నెల రోజుల వ్యవధి పంటకు ఎకరానికి కనీసం రూ.10 వేలు రైతులు ఖర్చు చేశారు. కొన్ని ప్రాంతాల్లో ఎకరాకు రూ.15 వేల వరకు ఖర్చయినట్లు బాధిత రైతులు తెలిపారు. అయినా శనగ పంటకు ఒక్క రూపాయి కూడా పరిహారం అందే పరిస్థితి లేదు. శనగ సాగు చేసుకునేందుకు విత్తనాన్ని 80 శాతం సబ్సిడీపై ప్రభుత్వం సరఫరా చేస్తూ చేతులు దులుపుకోవడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. పరిహారం చెల్లించాలని కోరుతున్నా మొర ఆలకించే పాలకులే కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంది 1357 ఎకరాల్లో, పొగాకు 1543 ఎకరాల్లో, మొక్కజొన్న 600 ఎకరాల్లో, వరి 2,610 ఎకరాల్లో దెబ్బతిన్నాయి.

రాజకీయ వేడి

- 22న వైసీపీ బస్సు యాత్ర
- 29న బాబు 'రా కదలిరా' సభ
- భారీగా ఏర్పాట్లు చేస్తున్న పార్టీ నాయకులు
- చీరాల నియోజకవర్గంలో ఊపందుకున్న సమీకరణలు



చీరాల, జనవరి 11: వైసీపీ బస్సుయాత్ర.. టీడీపీ రా కదలిరా సభలతో చీరాల నియోజకవర్గంలో రాజకీయం ఊపందుకుంది. ఈ నెల 22న వైసీపీ సాధికార బస్సుయాత్ర, 29న టీడీపీ అధినేత చంద్రబాబు రా కదలిరా సభలకు ఆయా పార్టీల నాయకులు బారీగా సన్నాహాలు చేస్తున్నారు. వైసీపీ బస్సుయాత్ర తొలి షెడ్యూల్‌లోనే చీరాల నియోజకవర్గం ఉంది. అయితే, ఆపార్టీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ బస్సుయాత్ర ఖరారైన తర్వాత రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. దీంతో ఆ షెడ్యూల్‌ను వాయిదా వేశారు. ప్రస్తుతం వెంకటేష్ కోలుకున్నారు. ఈ నేపథ్యంలో 22న జరగనున్న వైసీపీ బస్సు యాత్రలో వెంకటేష్ పాల్గొనేందుకు పూర్తిస్థాయిలో కార్యాచరణకు ఆపార్టీ వర్గీయులు అడుగులు వేస్తున్నారు. వేటపాలెంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే బలరాం మాట్లాడుతూ వెంకటేష్ ఆరోగ్య పరిస్థితిని వివరిస్తూ, వచ్చే ఎన్నికల్లో చీరాల నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా వెంకటేష్ పోటీ చేస్తారని, అందులో ఎలాంటి సందేహాలకు తావులేదని చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబు సభ నేపథ్యంలో స్థానిక వైసీపీ నేతల్లో నెలకొన్న అంతర్గత కుమ్ములాటలపై ఆ పార్టీశ్రేణులతో పాటు, ఇతర రాజకీయ వర్గాల్లోను చర్చ సాగుతోంది. ఈ నెల 29న చీరాలలో 'రా కదలిరా' సభలో చంద్రబాబు పాల్గొననున్నారు. అంతకుముందు ఓ సందర్భంలో చీరాల పర్యటన వర్షం కారణంగా రద్దయింది. ఇటీవల తుఫాన్ కారణంగా నష్టపోయిన పంటలను పరిశీలించేందుకు చంద్రబాబు జిల్లాలో పర్యటించినప్పటికి చీరాల నియోజకవర్గానికి రాలేకపోయారు. ఈ నేపథ్యంలో ఈనెల 29వ తేదీ చంద్రబాబు 'రా కదలిరా' సభపై టీడీపీ, జనసేనలో కదలిక మొదలైంది. నియోజకవర్గంలో పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఎంఎం కొండయ్య ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. తొలుత అధికారపార్టీ నుంచి ఆటుపోట్లు ఎదురయ్యాయి. పలు సవాళ్లు ఎదుర్కొన్నారు. వాటిని అధిగమిస్తూ తనదైన శైలిలో శ్రేణులను కూడగట్టుకుంటూ ముందుకు సాగుతూ వస్తున్నారు. ఇటీవల పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. ఈక్రమంలో కేడర్‌కు స్పష్టమైన సంకేతాలు ఇవ్వాల్సిన అవసరం అధినాయకులపై ఉందని పార్టీశ్రేణులతో పాటు సానుభూతిపరులు కూడా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక.. అధికార పార్టీ నేతలకు కాసులు కురిపిస్తోంది. ఇష్టారీతిన తవ్వుతూ.. తరలిస్తూ కాసులు పోగేసుకుంటున్నారు. అధికారిక రీచ్‌లతో పాటు అనధికార రీచ్‌ల్లోనూ యథేచ్ఛగా తవ్వకాలు చేస్తున్నారు. నిబంధనలు పట్టిం చుకోవడంలేదు. కళ్లెదుటే ఇసుక దోపిడీ జరుగుతున్నా మామూళ్ల మత్తులో అధికారులు మునిగిపోయారు. బిల్లులతో పని లేకుండా ఒకే బిల్లుపై పలుమార్లు ఇసుక తరలిపోతున్నా.. పట్టించుకునేవారు లేరు. ప్రభుత్వం వారంవారం పత్రికల్లో ధరను నిర్ణయిస్తూ ప్రకటిస్తున్నా.. వసూలు చేసే ధరకు పొంతనే ఉండటంలేదు. ప్రకాశం బ్యారేజి దిగువున అడ్డులేకుండా ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. అధికారిక రీచ్‌లలో ఒక లారీ ఇసుకకు బిల్లు తీసుకుని, ఆ తర్వాత రోజంతా అదే బిల్లుపై దొంగ రీచ్‌లలో పట్టపగలే లెక్కలేనన్ని ట్రిప్పులు తరలిస్తున్నారు. పర్యవేక్షించే అధికారే లేకపోవడంతో ఇష్టారాజ్య మైపోయింది. ఇప్పుడిప్పుడే నిర్మాణ రంగం పుంజు కొంటుండటంతో ఇసుకకు డిమాండ్ పెరిగింది. దీనిని ఆసరగా చేసుకొని సప్లయర్లు దోచుకుంటున్నారు. మైనింగ్ అధికారులు ప్రేక్షక పాత్రకు పరి మితం అవుతున్నారు. కనీసం జిల్లా యంత్రాం గమైనా అక్రమ ఇసుకపై చర్యలు తీసుకోక పోతుండటంపై విమర్శలు చెలరేగుతున్నాయి.



ఇసుక ఇష్టారాజ్యం

- అడ్డేలేకుండా తవ్వకం.. అమ్మకం
- ప్రభుత్వ ధరకు రెట్టింపు వసూలు
- ఒక బిల్లుతో కావాల్సినన్ని ట్రిప్పులు
- బుసక రీచ్‌ల్లోనూ ఇసుక తవ్వకాలు
- అధికారిక రీచ్‌లు మూడే.. అనధికారం లెక్కేలేదు
- మామూళ్ల మత్తులో మునిగి పట్టించుకోని అధికారులు

తెనాలి, గుంటూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎక్కడ చూసినా దొంగ ఇసుక... స్థానిక నేతల కనుసన్నల్లో ఒకప్పుడు గుట్టుగా సాగిన ఇసుక రవాణా ఇప్పుడు బహిరంగంగానే సాగిపోతోంది. ఉమ్మడి గుంటూరు పరిధి నుంచి వస్తున్న ఇసుక లారీలను కృష్ణా జిల్లాకు చెందిన రీచ్‌ల నిర్వాహకు లు పట్టుకుంటున్నారు. అంటే ఇక్కడ తవ్వి.. తరలిస్తున్నా ఇక్కడి అధికారులు కళ్లుమూసుకున్నట్లుగా అర్థమవుతుంది. బిల్లుతో పనిలేకుండా దొంగతనంగా తరలించడంతో ప్రభుత్వ నిర్ణయ ధరను మించి పెద్దగా పెంచకుండా అమ్మే స్తుంటే, వినియోగదారునికి మేలు జరుగుతున్నా, ప్రభుత్వ ఆదాయానికి మాత్రం గండిపడుతోంది. గతంలో ఉన్న జేపీ సంస్థ తప్పుకున్నాక, ప్రస్తుతం ఇసుక రీచ్‌లలో బిల్లులు జీసీకేసీ ప్రాజెక్ట్ అండ్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే పేరుతో ఇస్తున్నారు. ఈ కంపెనీ ప్రవేశించాక దుగ్గిరాల మండలం పెదకొండూరు, కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం, బాపట్ల జిల్లా కొల్లూరు మండలం గాజుల్లంకలో కొత్త రీచ్‌లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇవికాక జగనన్న కాలనీల కోసం బుసక రీచ్‌ల కింద అన్నవరం, వల్లభాపురం దగ్గర అనుమతులిచ్చారని సమాచారం. అయితే ఇవి కాకుం డా అనధికారికంగా ఇసుక తవ్వకానికి అవకాశం ఉన్న ప్రతి రీచ్‌లోనూ తవ్వేస్తున్నారు. అయినా అధికారులు మాత్రం పట్టించుకుంటున్న పరిస్థితిలేదు. పది చక్రాల లారీ లోడు పరిమితి కేవలం 18 టన్నులు మాత్రమే ఉంటే, ఏకంగా 25 టన్నులని బిల్లుపైనే రాసిస్తున్నా, రవాణా, మైనింగ్ అధికారులు పట్టించుకుంటున్న దాఖలాలే లేవు. ప్రకాశం బ్యారేజి దిగువున కొల్లిపర, మున్నంగి, బొమ్మువానిపాలెం, అన్నవరం, బాపట్ల జిల్లాలోని చిలుమూరు, ఈపూరు, పెసర్లంక, గాజుల్లంక, జువ్వలపాలెం రీచ్‌లలో యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు జరిగిపోతున్నాయి. సోమవారం రాత్రి అన్నవరపులంక దగ్గర్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్న రెండు లారీలను కొత్త కంపెనీ సిబ్బంది పట్టుకుని కొల్లిపర పోలీసులకు అప్పగించారనేది సమాచారం. అయితే దీనిపై కేసు నమోదు చేశామని చెబుతున్నా, లారీలు మాత్రం యథేచ్ఛగా బయటే తిరుగుతున్నాయని కొల్లిపరలోని అధికార పార్టీ నాయకులే చెప్పడం విశేషం. నదిలో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం అధికారికంగా అనుమతి ఇవ్వడంతో జీసీకేసీ సంస్థ పేరుతో ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. అయితే ఇక్కడ ఒక బిల్లు రాయించుకుని అదే బిల్లుపై ఇతర చోట్ల ఇసుక పోసుకుని తరలిస్తున్నారు. పది చక్రాల లారీలో కేవలం 18 టన్నుల పరిమాణం వరకు మాత్రమే ఇసుక తరలించేందుకు అనుమతి ఉంటే, అధికారికంగా రీచ్‌లు తెరచిన సంస్థ బిల్లులపైనే ఏకంగా 25 టన్నుల వరకు ఇసుక పోస్తున్నట్లు రాసేసి డబ్బు వసూలు చేయడం విశేషం. ఇది కాగితాలపైనే కనిపిస్తున్నా రవాణా శాఖ కానీ, సెబ్ కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. బిల్లుపై 25 టన్నులని రాసి 40 నుంచి 45 టన్నుల వరకు ఇసుక పోసేసి మిగిలిన పరిమాణానికి కంపెనీనే అనధికారిక దోపిడీకి తెరతీస్తోంది. ఇంతటి ఘరానా దోపిడీ ప్రత్యక్షంగా కనిపిస్తున్నా అంతా గప్‌చుప్ అన్నట్లు అధికారులు వ్యవహరించటం విశేషం.

దొంగ ఇసుకతో భారీగా లబ్ధి

ప్రకాశం బ్యారేజి దిగువున అధికారిక రీచ్‌లలో టన్ను ఇసుక రూ.475కు అమ్మాలని ప్రభుత్వం ధర నిర్ణయించింది. ఉదాహరణకు కొల్లిపర దగ్గర టన్ను ఇసుక రూ.475 ధర ఉంటే, తెనాలికి కిరాయి, ఇతర ఖర్చులు కలిపితే టన్ను రూ.650 వరకు పలుకుతుంది. జేపీ సంస్థ ఉన్న సమయంలోనే బిల్లుపై తీసుకొచ్చిన ఇసుకను తెనాలి పట్టణం, చుట్టుపక్కల ప్రాంతాల్లో టన్ను రూ.750 నుంచి రూ.900 వరకు అమ్మారు. కానీ ఇప్పుడు టన్ను కేవలం రూ.550 నుంచి రూ.600 వరకే పలుకుతుంది. ఇది కొంతవరకు వినియోగదారులకు మేలు జరిగే అంశమే. అయితే వీరికి జరిగే మేలు రూ.50 నుంచి రూ.100 వరకే అయితే దొంగతనంగా ఇసుక తీసుకొచ్చి అమ్ముతున్నవారు మాత్రం రూ.వేలల్లో లబ్ధి పొందుతూ ప్రభుత్వ ఆదాయానికి భారీగానే గండికొడుతున్నారు. అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవాల్సిన సెబ్, పోలీస్, మైనింగ్ శాఖలోని విజిలెన్స్ అధికారులు కొన్నిచోట్ల నేతల సిఫార్సులు, మరికొన్నిచోట్ల మామూళ్ల మత్తుతో పట్టించుకోవడంలేదు.

బుసక పేరు చెప్పి తరలింపు..

జగనన్న కాలనీలకు మెరకలు, పునాదుల నుంచి లెంటల్ లెవల్ లోపు గదుల్లో నింపేందుకు బుసక కావాలని అధికార పార్టీ నేతల అనుచరులు అనుమతులు తీసుకున్నారు. అయితే బుసక పేరుచెప్పి ఇసుక తరలిస్తున్నారు. కొల్లిపర మండలం అన్నవరం, బొమ్మువానిపాలెం రీచ్‌లలో బుసకకు అనుమతులిస్తే, మున్నంగి, వల్లభాపురం దగ్గర కూడా తవ్వకాలు చేస్తున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. పగలు బుసక తవ్వుతున్నా, రాత్రి మాత్రం ఇసుక తరలిస్తున్నారు. బొమ్మువానిపాలెం వంటి రీచ్‌ల దగ్గర బుసక అనుమతులున్నా, ఇక్కడే ఇసుక రీచ్‌కు కూడా అనుమతి ఉండటంతో పగలు కూడా అడ్డులేకుండా తరలిస్తున్నారని అధికారిక రీచ్‌ల నిర్వాహకులే చెబుతున్నారు. ఉదాహరణకు బొమ్మువానిపాలెం రీచ్‌కు అనుమతి ఉంటే, ఆ రీచ్‌లో ఒక ట్రిప్‌కు బిల్లు తీసుకుని తర్వాత ట్రిప్పులు ఆ రోజులో ఎన్ని అవ కాశం ఉంటే అన్నిటిని పక్కనున్న అన్నవరం, బొమ్మువానిపాలెం బుసక రీచ్‌లలో, మున్నంగి, కొల్లిపర, వల్లభాపురం రీచ్‌లలో తవ్వుకుపోయి అమ్మేసుకుంటున్నారు. ఈ కారణంగా ప్రభుత్వానికి, అటు ఇసుక అనుమతులు దక్కించుకున్న సంస్థ ఆదాయానికి గండిపడుతోంది. మరోపక్క అధికారిక రీచ్‌లో ఒక లోడ్ 25 టన్నులకు రూ.11,875 చెల్లించి తర్వాత ట్రిప్పులకు అదే బిల్లుపై ఆ రీచ్‌లోనే రూ.7,500 నుంచి రూ.9 వేల వరకు చెల్లిం చి అనధికారికంగా ఇసుక తరలిస్తున్నారు.



Projects and Works Pvt Ltd.,

SAND WAY BILL

12595

1	Name of the Mineral	SAND
2	Delivery Location	Guntur
3	Quantity	25
4	Sand Value	475
5	Total Amount Paid	11,875
6		[illegible]
7	Vehicle Registration Number	AP 16 TS 6716
8	Driver Name	[illegible]
9	Driver Contact Number	[illegible]
10	Valid Upto	[illegible]

Signature of the Issuing Authority

జీసీకేసీ సంస్థ పేరుతో కొల్లిపర మండలంలో ఇస్తున్న బిల్లులు, 25 టన్నులు పోస్తున్నట్లు ఉన్న బిల్లు

గుంటూరులో 5 టన్నులు రూ. 5,800

ఇసుక ధరలను సప్లయర్లు మళ్లీ పెంచేశారు. ఇటీవల ఇసుక ధర తగ్గించినట్లే తగ్గించి ఒక్కసారిగా రెట్టింపు చేయడంపై భవన నిర్మాణదారులు, సొంత ఇల్లు నిర్మించుకుంటున్న సామాన్యులు తీవ్ర ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు మున్నంగి, వల్లభాపురం రీచ్‌లను కేటాయించారు. అక్కడ టన్ను రూ.475గా ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా పాయింట్ల నుంచి గుంటూరు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. ఈ దృష్ట్యా టన్నుకు రూ.196 రవాణా చార్జీలను నిర్ణయించారు. మొత్తంగా టన్ను ఇసుక ధర రూ.671 దాటడానికి వీల్లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనిని పరిగణనలోకి తీసుకుంటే 5 టన్నుల ట్రాక్టర్ ఇసుక రూ.3,355కి సరఫరా చేయాలి. అయితే సప్లయర్లు ఏకంగా రూ.5,800 డిమాండ్ చేస్తున్నారు. అదే 11 టన్నుల 6 టైర్ల లారీకి రూ.9,500 వసూలు చేస్తున్నారు. 10 టైర్ల లారీకి 27 నుంచి 28 టన్నులు వస్తుందని, టన్ను రూ.800 చొప్పున లెక్కించి రూ.22 వేలు చెల్లించాల్సిందిగా కోరుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలతో పోల్చితే ట్రాక్టరు, 6 టైర్ల లారీకి దాదాపుగా రెట్టింపు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. 10 టైర్ల లారీ విషయానికి వస్తే 35 టన్నులకు పైగా లోడిం గ్ చేసి తీసుకొచ్చి అందులో ఆరు, ఏడు టన్నుల ఇసుకని ట్రాక్టర్లలో అన్‌లోడింగ్ చేసి మిగతా 27 టన్నులు రూ.800 చొప్పున టన్నుకు రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నారు.

ఇసుక వాహనాలు సీజ్ చేయొద్దని అనధికార ఆదేశాలు

జిల్లా వ్యాప్తంగా ఇసుక తరలించే ట్రా క్టర్లు, లారీలను ఎక్కడా సీజ్ చేయొద్దని ప్రభుత్వ పెద్దల నుంచి మైనింగ్, పోలీసు, విజిలెన్స్ తదితర శాఖలకు ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం. అలానే రవాణా శాఖకు కూడా ఈ విషయంలో నిర్దిష్టమైన ఆదేశాలు ఉండటంతో ఓవర్ లోడింగ్ జరు గుతున్నా మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్లు ఎలాంటి కేసులు నమోదు చేయడం లేదు.





ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ విజయవాడలో గురువారం నిర్వహించిన ముగ్గుల పోటీలో అద్దేపల్లి సునీత(సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల) ఉమ్మడి గుంటూరు జిల్లా తరపున పాల్గొని రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించింది.



చిక్కులు తెచ్చిపెట్టిన నయన్ అన్నపూరణి

నెట్‌ఫ్లిక్స్ నుంచి తొలగింపు



ఇటీవలే ఓటీటీ స్ట్రీమింగ్ మొదలైన నయనతార రీసెంట్ మూవీ 'అన్నపూరణి'ని ఉన్నట్టుండి ఓటీటీ ప్లాట్‌ఫామ్ నుంచి తొలిగించారు. స్వయంగా ఆ చిత్ర నిర్మాణసంస్థ అయిన జీ స్టూడియోస్ ఈ నిర్ణయం తీసుకుంది. నిజానికి 'అన్నపూరణి' థియేటర్లలో కూడా పెద్దగా ఆడలేదు. థియేటర్లలో మిశ్రమ స్పందనతో నిర్మాతకు నష్టాలే తెచ్చిపెట్టింది. రీసెంట్‌గా ఈ సినిమాను ఓటీటీలో విడుదల చేశారు. అసలు చిక్కు ఇక్కడే వచ్చింది. కథ ప్రకారం ఇందులోని కొన్ని సన్నివేశాలు మత విశ్వాసాలను భంగపరిచేలా ఉన్నాయని పలువురు అభ్యంతరాలు వెలిబుచ్చారు. నయన్‌తోపాటు చిత్రబృందంపై మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్, ముంబైలో కేసులు నమోదయ్యాయి. దీంతో చిత్ర నిర్మాణ సంస్థ జీ స్టూడియోస్ ఈ సినిమాను ఓటీటీ స్ట్రీమింగ్ నుంచి తొలగించింది. మతవిశ్వాసాలను కించపరిచే ఉద్దేశం తమకు లేదని, తమకు అన్ని మతాలూ సమానమేనని, ఈ విషయంలో తెలిసిగానీ, తెలియకగానీ ఎవర్నయినా బాధపెట్టి ఉంటే క్షమించాలని జీ స్టూడియోస్ వివరణ ఇచ్చుకుంది. 'అగ్నిహోత్రం లాంటి సంప్రదాయ కుటుంబంలో పుట్టిన ఓ అమ్మాయి, చెఫ్ కావాలనే తన కోరికను ఎలా సాకారం చేసుకుంది?' అనే ప్రశ్నకు సమాధానమే 'అన్నపూరణి' కథ. నయనతార టైటిల్‌రోల్ పోషించిన ఈ చిత్రంలో సత్యరాజ్, జై కీలక పాత్రలు పోషించారు. నీలేశ్ కృష్ణ దర్శకుడు.

ఫిబ్రవరిలో హ్యాపీ ఎండింగ్



యష్ పూరి కథానాయకుడిగా నటించిన చిత్రం 'హ్యాపీ ఎండింగ్'. అపూర్వ రావ్ కథానాయిక. కౌశిక్ భీమిడి దర్శకత్వంలో యోగేష్ కుమార్, సంజయ్ రెడ్డి, అనిల్ పల్లాల నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఫిబ్రవరి 2న ప్రేక్షకుల ముందుకు తీసకొస్తున్నట్లు యూనిట్ గురువారం తెలిపింది. 'ఇప్పటివరకూ విడుదలైన ప్రచార చిత్రాలకు చక్కని ఆదరణ లభిస్తోంది, వైవిధ్యమైన కథతో 'హ్యాపీ ఎండింగ్' చిత్రాన్ని రూపొందించాం' అని మేకర్స్ తెలిపారు. అజయ్ ఘోష్, విష్ణు, ఝాన్సీ కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: రవి నిడమర్తి. సినిమాటోగ్రఫీ: అశోక్ సీపల్లి







అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగం దుర్మార్గం

● రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు


సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

బాపట్ల, జనవరి 11 : న్యాయమైన సమస్యలపై ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించటం దుర్మార్గమని రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు అన్నారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు అధ్యక్షతన గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య మాట్లాడుతూ పోరాడుతున్న కార్మికుల సమస్యలపై చర్చించి ఒక పరిష్కారం చూపకుండా ఎస్మా చట్టాన్ని ప్రయోగించటం రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి పరాకాష్ట అన్నారు. అంగన్‌వాడీల పోరాటానికి అండగా నిలవాలని కోరారు. నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ కనీస వేతనాలు అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు అదుపు చేయటంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఈ సమావేశంలో బహుజన సమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు, వీకేసీ పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, కేవీపీఎస్ నాయకులు కె.శరత్, సీఐటీయూ నాయకులు బి.తిరుమలరెడ్డి, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు గుదే రాజారావు, సమాజ్‌వాది పార్టీ నాయకులు మేదా శ్రీనివాసరావు, పర్రె కోటయ్య, కె.నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేశప్రజలకు అంబేద్కర్ ఆదర్శనీయులు : కలెక్టర్


డాక్టర్ అంబేద్కర్ జీవిత చరిత్ర తెలియజేసే చిత్రపటాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల, జనవరి 11 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దేశ ప్రజలందరికీ ఆదర్శనీయులని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. సామాజిక సమతా సంకల్పం కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ జీవితచరిత్రపై సాంఘిక సంక్షేమ సాధికారితశాఖ, డీఆర్‌డీఏ అధికారులు గురువారం కలెక్టరేట్‌లో ఫొటోఎగ్జిబిషన్ నిర్వహించారు. అంబేద్కర్ జీవితంపై ఏర్పాటు చేసిన చిత్రాల ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించి వాటిని వీక్షించారు. అంబేద్కర్ పటానికి అధికారులు, దళితనాయకులతో కలిసి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సువిశాల భారతదేశంలో ఎన్నో సామాజిక వర్గాలు ఉన్నప్పటికీ ప్రజలంతా ఐకమత్యంతో ఉండటం రాజ్యాంగం ద్వారానే సాధ్యమని కలెక్టర్ చెప్పారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ అంబేద్కర్ సేవలకు ప్రతిరూపంగా స్మృతి వనాన్ని నిర్మించటం చారిత్రక ఘట్టమన్నారు. జిల్లా వ్యాప్తంగా అంబేద్కర్ జీవితచరిత్ర ఫొటోఎగ్జిబిషన్ తదితర కార్యక్రమాలు నిర్వహించటం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారిణి జె.రాజాదెబోరా, డీఆర్‌డీఏ పీడీ సీహెచ్ కృష్ణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, డీఎస్‌వో విలియమ్స్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మీ, దళిత నాయకులు డాక్టర్ జి.చార్వాక, ఇనగలూరి మాల్యాద్రి, శీలం రోజన్‌బాబుపాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు అండగా జగనన్నతోడు : కలెక్టర్

బాపట్ల,జనవరి 11 : చిరువ్యాపారులు, సంప్రదాయ వృత్తిదారులకు జగనన్నతోడు పథకం ఎంతో అండగా నిలుస్తుందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. జగనన్నతోడు పథకం కింద చిరువ్యాపారులకు నగదు పంపిణీ కార్యక్రమాన్ని తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి వర్చువల్ విధానంలో గురువారం బటన్‌నొక్కి ప్రారంభించగా బాపట్ల కలెక్టరేట్‌లో వీక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. లబ్దిదారులకు ఎమ్మెల్యే కోన రఘుపతితో కలిసి కలెక్టర్ చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి వ్యాపారులుగా ఎంతో ఇబ్బందులు పడుతున్న వారికి ప్రభుత్వం తోడుగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సి.హెచ్.కృష్ణ, ఎల్‌డీఎం శివకృష్ణ, డీఆర్‌డీఏ మెప్మా అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమంతో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన

● ఆరవ అదనపు జిల్లా జడ్జి బాలాజి


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి బాలాజి

బాపట్ల, జనవరి 11 : ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమం ద్వారా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, ఆరవ అదనపు జిల్లా జడ్జి కేపీ బాలాజి తెలిపారు. ఆపరేషన్ స్వేచ్ఛ తొలి విడత కార్యక్రమంలో భాగంగా చైల్డ్ లేబర్ ఫ్రీస్టేట్‌గా చేయబోయే కార్యక్రమంపై స్వచ్ఛంద సేవాసంస్థ, సీఫార్డ్ నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్‌తో రిస్క్యూ ఆపరేషన్ కార్యక్రమాన్ని గురువారం బాపట్లలో నిర్వహించారు. పట్టణంలోని మెకానిక్ షెడ్‌లను, హోటల్స్‌ను సందర్శించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బాపట్ల లేబర్ ఆఫీస్ ఆధ్వర్యంలో ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమంలో భాగంగా దీనిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ డి.చంద్రశేఖర్, ఎ.రాజాసాల్మన్, చక్రవర్తి, డి.రాము, పి.ప్రసాదరావు, బి.భాగ్యలక్ష్మి, కిషోర్, నాగరాజు, నాగమణి పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి టీడీపీని చేరువచేయటమే లక్ష్యం

● మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానేట్ సోపాటి


చీర, సంచి పంపిణీ చేస్తున్న డాక్టర్ గ్లోరి యానేట్ సోపాటి తదితరులు

పిట్టలవానిపాలెం, జనవరి 11 : ప్రతి ఇంటికి తెలుగుదేశం పార్టీని చేరువ చేయటమే లక్ష్యంగా బాపట్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ పిలుపుమేరకు పిట్టలవానిపాలెం మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానేట్ సోపాటి, మండల టీడీపీ మాజీ అధ్యక్షులు గోకరాజు శ్రీధర్ వర్మతో కలిసి జీఎస్‌పాలెంలో గురువారం ఇంటింటికి తిరిగి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోడూరుపాలెం గ్రామ పంచాయతీలలో డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, కోడూరు గ్రామ సర్పంచ్ ఐనంపూడి శ్రీనివాసరావు, కోడూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు జాలాది అశోక్, టీడీపీ నాయకులు వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి కెళ్ళి పార్టీవిధానాలు గురించి వివరించారు. మహిళలకు చీరె, నిత్యావసరాల సరుకులు తెచ్చుకునే సంచి భవిష్యత్తుకుగ్యారెంటి గురించి తెలియజేసే కరపత్రాన్ని అందజేశారు. ఆయా కార్యక్రమాలలో జీఎస్‌పాలెంగ్రామ టీడీపీ అధ్యక్షులు పమిడి వెంకటరామయ్య, యేమినేని శ్రీనివాసరావు, నర్రా గోపి, తెలుగు మహిళలు, పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

కర్లపాలెం, జనవరి 11 : కర్లపాలెం పంచాయతీ పరిధిలో గల ఎం.వి.రాజుపాలెంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను శుక్రవారం గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి పార్టీశ్రేణులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఏలీషాబాబు, కోఆప్షన్‌నెంబరు అమీర్‌బేగ్, ఎంపీటీసీ ఆసీఫ్ ఆలి, ప్రధానోపాధ్యాయులు విజయభాస్కర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, కార్యదర్శి మోదీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పింఛన్‌దారులకు దుప్పట్లు పంపిణీ

కర్లపాలెం, జనవరి 11 : మండలంలోని పెదగొల్లపాలెం, బోలాయపాలెం గ్రామాలలో గురువారం జరిగిన కార్యక్రమాలలో ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొన్నారు. మండలంలోని బోలాయపాలెం గ్రామంలో పెన్షన్‌దారులకు కోన రఘుపతి దుప్పట్లు పంపిణీ చేశారు. ముందుగా గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. మండలంలోని పెదగొల్లపాలెంలో నూతనంగా నిర్మాణం చేసిన సచివాలయాన్ని ఎమ్మెల్యే కోన రఘుపతి పార్టీ శ్రేణులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్, బోలాయపాలెం గ్రామసర్పంచ్ లక్ష్మీ భావన్నారాయణ, వైసీపీ మండల కన్వీనర్ యల్లావుల ఏడుకొండలు, మార్కెట్ కమిటీ చైర్మన్ సీతారామిరెడ్డి, పెదగొల్లపాలెం సర్పంచ్ సురేష్‌రాదవ్ (నాని), జిల్లా కార్యదర్శి మందపాటి పరమానందకుమార్, జెర్రి, సాగర్, ఎంపీటీసీ యారం వనజ, చీమట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉరితాళ్ళతో అంగన్‌వాడీల నిరసన


బాపట్లలో ఉరితాళ్ళతో నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

బాపట్ల, జనవరి 11 : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ చేస్తున్న సమ్మెలో భాగంగా గురువారం ఉరితాళ్ళతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కరించమని కోరుతూ సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించటం దారుణమన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. సమస్యలు పరిష్కరించకుండా నోటీసులు జారీ చేయటాన్ని తప్పు పట్టారు. 24గంటల రిలేనిరాహారదీక్షలకు కూడా స్పందించకపోతే అమరణ నిరాహారదీక్షలకు సిద్ధమౌతామని హెచ్చరించారు. దీక్షలో డి.రాహేల్, అశ్విని, శివపార్వతి, వల్లూరమ్మ, తిరుమల, రూపారాణి, యోహన్‌కుమారిలు కూర్చొన్నారు. వీరికి బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి కొచ్చెర వినయ్‌రాజు, సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్యక్షుడు మేదా శ్రీనివాసరావు, పర్రె కోటయ్య సంఘీభావం తెలిపారు. దీక్షా శిబిరంలో వారికి మద్దతుగా నిలిచారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రేఖా ఎలిజబెత్, స్థానిక నాయకులు వెలగా శైలశ్రీ, సీతామహలక్ష్మి, గీత, పద్మ, పార్వతి, భారతి, హేమమాలిని, జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్, జె.శామ్యూల్, శరత్ పాల్గొన్నారు.

రెండో రోజు కూడా నోటీసులు జారీ

బాపట్ల, జనవరి 11 : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ చేపట్టిన సమ్మెను అణిచివేసే ప్రయత్నంలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం రెండవరోజు కూడా నోటీసులు జారీ చేశారు. కొన్నిచోట్ల కార్యకర్తలకు, హెల్పర్స్‌కు నోటీసులు అందజేయగా మరికొన్ని చోట్ల కేంద్రాలకు నోటీసులు అంటించారు. అదేవిధంగా ఇళ్ళవద్ద కూడా నోటీసులు అంటించారు. నోటీసుకు తగిన వివరణ ఇవ్వాలని లేకుంటే చర్యలు ఎందుకు తీసుకోకూడదని అధికారులు నోటీసులో పేర్కొన్నారు.

అంగన్‌వాడీ టీం వర్సెస్ ప్రభుత్వం టీం


వేమూరులో టగ్ ఆఫ్ వార్‌తో నిరసన వ్యక్తపరుస్తున్న అంగన్‌వాడీలు

వేమూరు, జనవరి 11 : వేమూరులో 31రోజుల నుండి నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు గురువారం అంగన్‌వాడీ టీం వర్సెస్ ప్రభుత్వం టీం (టగ్ ఆఫ్ వార్)తాడాటతో నిరసన వ్యక్తపరిచారు. వేతనాలు పెంచాలి అని అంగన్‌వాడీ టీం అంటుంటే పెంచలేమని ప్రభుత్వం వాదనలు తెలియజేస్తూ ఆటను ఆసక్తికరంగా సాగించారు. కార్యక్రమానికి హాజరైన సిఐటియు నాయకులు అగస్టీన్ మాట్లాడుతూ అంగన్‌వాడీల ఎస్మా చట్టాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సంఘ నాయకురాలు అమలా సరోజినీ, బుల్లెమ్మాయి, దుర్గా, చైతన్య, ధనలక్ష్మీ పాల్గొన్నారు.

పాటలుపాడుతూ అంగన్‌వాడీల నిరసన

భట్టిప్రోలు, జనవరి 11 : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న నిరవధిక సమ్మె గురువారానికి 31వ రోజుకు చేరింది. అంగన్‌వాడీల సమ్మెకు సీఐటీయు, ఎస్‌ఎఫ్‌ఐనాయకులు సంఘీభావం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల పట్ల కపట ప్రేమను నటిస్తుందని ఒక ప్రక్కన మహిళల పక్షపాతి ప్రభుత్వం అంటూ మరో ప్రక్కన అంగన్‌వాడీల సమ్మెను అణచివేస్తుందని అంగన్‌వాడీలు ఒంటికాలు మీద కొంగజపంగా ఉండి నిరసన తెలియజేశారు. సీఐటీయు నాయకులు జి. సుధాకర్ మాట్లాడుతూ అంగన్‌వాడీల పోరాటాన్ని అణచివేయాలనుకుంటే మరింత పట్టుదలతో ప్రభుత్వంపై పోరాడడానికి సిద్ధమవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ మండల నాయకురాలు రమాదేవి, గృహలక్ష్మీ, సూర్యలక్ష్మీ, సెక్టార్ లీడర్లు చెల్లమ్మ, సంధ్య, రత్నకుమారి, మమత, రజిత, లలిత తదితరులు పాల్గొన్నారు.

● కొల్లూరు, జనవరి 11 : అంగన్‌వాడీ కార్యకర్తలు ముగ్గులు వేసి ప్రభుత్వంపై తమనిరసన వ్యక్తం చేశారు. గురువారం కొల్లూరులో 31వ రోజున అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు జగనన్న మా వైపు చూడన్న, ఎస్మా వద్దు జీతాలు పెంచు అనే నినాదాలతో తీర్చిదిద్దిన రంగవల్లులు ప్రజలను ఆకర్షించాయి. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.సుధాకర్, బి.సుబ్బారావు, జనసేన మండల కన్వీనర్ బి.చలమయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా అంగన్‌వాడీ కార్యకర్తల ఇంటి గోడలకు ఐసీడీఎస్ అధికారులు నోటీసులు అంటించారు. గురువారం కొల్లూరుతో పాటు పలు గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తల ఇళ్లకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సచివాలయ సిబ్బంది వెళ్లి ఇంటి గోడలకు నోటీసులు అంటించారు. నోటీసులు అతికించినట్లుగా ఫొటోలు సైతం అధికారులు తీసుకున్నారు. అప్పటికే కార్యకర్తలు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద నోటీసులు అతికించారని, మళ్లీ ఇళ్ల వద్ద ఎందుకు అతికిస్తున్నారంటూ ప్రశ్నించగా ఏం కాదులే అంటూ సమాధానం ఇవ్వడం కొసమెరుపు.


రేపల్లెలో గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

● రేపల్లె, జనవరి 11 : అంగన్‌వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం కక్షసాధింపులకు పాల్పడుతుందని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా నాయకురాలు వై.కనకదుర్గ ఆవేదన వ్యక్తం చేశారు. రేపల్లె తాలూకా కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద అంగన్‌వాడీలు, ఏఐటియూసీ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె గురువారానికి 31వరోజుకు చేరుకుంది. అంగన్‌వాడీలు గడ్డి తింటూ నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల కనీస వేతనంపై రాష్ట్రప్రభుత్వం మొండిగా వ్యవహరించటంతో ఆకలి మంటలను చల్లార్చుకోవటానికి గడ్డి తిని బతకాలా అంటూ ప్రశ్నించారు. ఈసమ్మెకు అరుణశ్రీ దివ్యాంగుల సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతును తెలిపింది. ఈ కార్యక్రమంలో వసుంధర దేవి, జానం మురళీకృష్ణ, అడిగోపుల ప్రసాద్, షేక్ ఖాదవర్‌వలి, దోవ గోపి, పోబులేశ్వరరావు, ఎ.వెంకటేశ్వరరావు, స్వప్నకుమారి, క్రీస్తుదానమ్మ, పద్మావతి, జయలక్ష్మీ, కె.వెంకటేశ్వరమ్మలు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం కపటప్రేమను నటిస్తుందని ఓప్రక్కన మహిళా పక్షపాతి ప్రభుత్వం అంటూ మరోప్రక్కన అంగన్‌వాడీలను అణచివేత పెడుతుందని అంగన్‌వాడీ జిల్లా నాయకురాలు కె.ఝాన్సీ అన్నారు. గురువారం స్థానిక సీడీపీవో కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు, సిఐటియూ నాయకులు దీక్ష 31వరోజుకు చేరింది. కార్యాలయం వద్ద సమస్యలు పరిష్కారం కోరుతూ మోకాళ్ళపై నుంచుని నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ షోకాజ్ నోటీసులు ఇచ్చి బెదిరింపులకు పాల్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్, నాయకురాలు ఎస్.కృష్ణకుమారి, వై.మేరీమణి, జ్యోతి, శ్రీలత, నిర్మలాజ్యోతి, రజని, జయప్రద తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్

సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించాలి : జేసీ

బాపట్ల, జనవరి 11 : జిల్లాలో సంక్రాంతి సంబరాలను తెలుగు సంస్కృతి సాంప్రదాయాలను ఉట్టిపడేలా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో సంక్రాంతి సంబరాల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జేసీ మాట్లాడుతూ ఈనెల 12న కలెక్టరేట్ ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించాలన్నారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా కలెక్టరేట్ ప్రాంగణాన్ని సుందరంగా తయారు చేయాలని చెప్పారు. ఉద్యోగులకు క్రీడా పోటీలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మహిళా ఉద్యోగులకు ముగ్గుల పోటీలను నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ కృష్ణ, డ్వామా పీడీ డాక్టర్ బి.అర్జునరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ, గృహ నిర్మాణ శాఖ పీడీ ప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్‌ఈ హరినారాయణ, డీఎస్‌వో విలియమ్స్, డీఎం శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.

మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు

బాపట్ల, జనవరి 11 : బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భోగిమంటలు, రంగవల్లులు, కోలాటం, నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా ముందుండాలని ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు తెలిపారు. ముగ్గుల పోటీలలో విజేతలను మానం మల్లేశ్వరి ఎంపిక చేసి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ దొప్పలపూడి రామ్మోహనరావు, గెల్లి దిలీప్‌కుమార్, కరస్పాండెంట్ కొమ్మినేని హరిపద్మ ప్రసాద్, కోశాధికారి తాళ్ళూరి రామకృష్ణ, ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఐ.హరిత పాల్గొన్నారు.


భోగిమంటలు వేస్తున్న విద్యార్థినులు, అధ్యాపకులు

వృద్ధులకు అన్నదానం

కర్లపాలెం, జనవరి 11 : మండలంలోని యాజలి గ్రామంలోని గుండ్రెడ్డి రామయ్య, గుండ్రెడ్డి అప్పయ్య, పుప్పాల బసవయ్య స్మారక వృద్ధాశ్రమంలో ఫోరం ఫర్ బెటర్ అధ్యక్షులు పీసీ.సాయిబాబు తమ తండ్రి పుప్పాల వెంకట్రావు వర్ధంతి సందర్భంగా వృద్ధులకు అన్నదానం, పండ్లు, మిఠాయిలను గురువారం పంపిణీ చేశారు.

సమ్మె విజయవంతంపై కార్మికుల హర్షం

బాపట్ల,జనవరి 11 : మున్సిపల్ కార్మికుల సమ్మె విజయవంతం కావటంపై ఏఐటీయూసీ, సీపీఐ, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం స్వీట్‌లు పంచుకొని సంతోషించారు. వేతనం పెంచటంతోపాటు ఇతర బెనిఫిట్‌లు కల్పించటం సంతోషదాయకమన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చాలని లేకుంటే తిరిగి సమ్మెను కొనసాగిస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకుడు జెబి.శ్రీధర్, నియోజకవర్గ కార్యదర్శి దుండి కనకారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్, జిల్లా కార్యదర్శి సుబ్బారావు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

బాపట్ల, జనవరి 11 : నియోజకవర్గంలో గురువారం సెబ్అధికారులు విస్తృత దాడులు నిర్వహించారు. పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం గ్రామంలో అక్రమ మద్యం విక్రయిస్తున్న మన్నెం వాసుపై కేసు నమోదు చేసి అక్కడ ఉన్న 15 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ ఎస్.శ్రీనివాసులు తెలిపారు. అదేవిధంగా బాపట్ల మండలం చెరువుజమ్ములపాలెం గ్రామంలో కాగిత రమ అక్రమ మద్యం విక్రయిస్తుండగా దాడి చేసి 19 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. ఆయా కార్యక్రమాలలో ఎస్సై ప్రభుదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సాల్వేషన్ ఆర్మీ యూత్ కాంగ్రెస్ వేడుకలు

బాపట్ల, జనవరి 11 : సాల్వేషన్ ఆర్మీ ఇండియా సెంట్రల్ టెరిటోరియల్ యూత్ కాంగ్రెస్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సాల్వేషన్‌ఆర్మీ మెయిన్ చర్చి ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి టెరిటోరియల్ కమాండర్ కల్నల్ యాకుబ్ మాసి, కల్నల్ సుమిత్రమాసిలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. పెద్ద ఎత్తున యూత్ కాంగ్రెస్ ర్యాలీ నిర్వహించారు. యువత ఆధ్యాత్మిక విలువలు కలిగియుండాలన్నారు. కార్యక్రమంలో బి.జోసఫ్, గేరా థామస్, బిషిబెన్, సాల్వేషన్ ఆర్మీ డివిజనల్ యూత్ సెక్రటరీలు, యాక్టివ్ అధికారులు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణపరమాత్ముని అవతారంలో బగళాముఖి అమ్మవారు

పిట్టలవానిపాలెం, జనవరి 11 : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారికి పుష్యమాస అమావాస్యను పురస్కరించుకొని గురువారం శేషవాహనంలో వేణుదారి శ్రీకృష్ణపరమాత్ముని అవతారంలో శ్రీబగళాముఖి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా వివిధ గ్రామాలలు నుండి భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయ అర్చకులు భక్తులకు పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు అవగాహన కార్యక్రమం

బాపట్లరూరల్, జనవరి 11 : గ్రూప్-2, ఇతర పోటీ పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగ యువతకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం జనవిజ్ఞానవేదిక రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వర్లురెడ్డి నిర్వహించారు. పోటీపరీక్షలకు సంబంధించిన పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పోటీపరీక్షలకు హాజరయ్యే యువతీ, యువకులు అవగాహన కొరకు నిర్వాహణ కమిటీని ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ప్రత్యేకంగా సంక్రాంతి పండుగ సందర్భంగా సాంస్కృతిక మేళాలో సంగీతవిభావరి జరిగిందన్నారు. కార్యక్రమంలో కె.అబ్రామ్, ఆసోది శంకర్‌రెడ్డి, ఉషారాణి, అక్షరదీప్తి, రామకృష్ణారెడ్డి, సత్యనారాయణ, మిర్యాల సుబ్బారావు,కిరణ్‌కుమార్, లోకేష్ పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా బీసీల కులగణన నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కేసన శంకరరావు

చెరుకుపల్లి, జనవరి 11 : దేశవ్యాప్తంగా బీసీల కులగణన నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. ఈసందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ జీవోతో అన్ని రాష్ట్రాల నుంచి కులగణన నిర్వహించవచ్చని అయినా బీజేపీ ఆదిశగా ప్రయత్నం చేయటం లేదని ఆయన విమర్శించారు. రాష్ట్రాలు సహకరిస్తున్నా కేంద్రం సహకరించకపోవడం బీజేపీ దేశవ్యాప్తంగా అనుసరిస్తున్న ద్వంద వైఖరికి నిదర్శనం అన్నారు. ఇప్పటికైనా బీజేపీ పెద్దలు కళ్ళు తెరిచి దేశవ్యాప్తంగా కులగణనకు ముందుకు రావాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, నేతలు రాంబాబు, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

బీసీల వెన్ను విరుస్తున్న జగన్‌రెడ్డి

రేపల్లె, జనవరి 11 : రాష్ట్రంలో 74 మంది బీసీ నేతలను క్రూరంగా నరికి చంపినది జగన్‌రెడ్డి ముఠానేనని రాష్ట్ర చేనేత విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి జీవీ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం బీసీల వెన్ను విరుస్తున్న పోస్టర్‌ను పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ నాయకుడైన తోట చంద్రయ్యను మాచర్లలో అతి దారుణంగా పొట్టన పెట్టుకున్నారన్నారు. సబ్బం హరి ఇల్లును ధ్వంసం, అయ్యన్న ఇంటి గోడను కూల్చటం, పల్లా శ్రీనివాసరావు బిల్డింగ్‌ను కూల్చటాన్ని చూస్తుంటే ప్రశ్నించే బీసీ నేతలపై వైసీపీ ప్రభుత్వం దహనకాండ సృష్టిస్తుందన్నారు. 75,760కోట్లు బీసీ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్ళించిన ఘనత జగన్‌దేనన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, తాడిపర్తి మల్లికార్జున్‌రావు, పీవీ చింతారావు, చెన్ను నాగమల్లేశ్వరరావు, సాయిబాబు, యరగళ్ళ ధర్మతేజ, మోపిదేవి వీర్రాజు, వాకా వెంకటేశ్వరరావు, ఉప్పాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై రెండు రోజుల శిక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో అనురాధ

వేమూరు, జనవరి 11 : రాష్ట్ర పంచాయితీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం స్థానిక రోశయ్య మీటింగ్ హాలులో గ్రామ పంచాయితీల అభివృద్ధి ప్రణాళిక తయారీపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఇన్‌చార్జి ఎంపీడీవో అనురాధ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024-2025ఆర్థిక సంవత్సరానికి అభివృద్ధి ప్రణాళిక తయారీపై పంచాయితీరాజ్‌శాఖ సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యల విషయంపై పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సాధారణ నిధుల నుంచి చేపట్టాల్సిన పనులను గురించి వివరించారు. నిధులు ఖర్చు విషయంలో జాగ్రత్తలు వహించాలని ఏ మాత్రం తప్పిదం జరిగినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈవోపీఆర్డీ శేఖర్ మాట్లాడుతూ పంచాయితీరాజ్ చట్టంలోని అంశాలను వివరించారు. గ్రామ పంచాయితీ కార్యదర్శి, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది హాజరయ్యారు.

చుండూరుకు మరో విద్యుత్ సబ్‌స్టేషన్ : ఏఈ

చుండూరు, జనవరి 11 : మండలానికి మరో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అనుమతి లభించినట్లు విద్యుత్ ఏఈ అర్జునరావు తెలిపారు. మండల అధ్యక్షులు జాలాది రూబెన్ అధ్యక్షతన గురువారం జరిగిన విద్యుత్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో అర్జునరావు మాట్లాడుతూ ప్రస్తుతం చుండూరు, యడ్లపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయని, విద్యుత్‌లోడ్ అధికంగా ఉండటంతో తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయి. దీనిని నివారించేందుకు చినగాదెలవర్రు, చినపరిమి గ్రామాల మధ్య ఏడు గ్రామాలకు అందుబాటులో ఉండే విధంగా సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభమవుతామని తెలిపారు. ప్రస్తుతం 70 ట్రాన్స్‌ఫార్మర్లకు ఎంసిబి బాక్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులు పంట పొలాల్లో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అప్పిరెడ్డి, రైతులు, విద్యుత్ అధికారులు శంకర్, ప్రసాద్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

అమృతలూరు, జనవరి 11 : విద్యతోనే అభివృద్ధి సాధ్యం అని పలువురు వక్తలు పేర్కొన్నారు. అమృతలూరులో మాజీ ఎంపీపీ గొట్టిపాటి పూర్ణకుమారి, గంగాధర్‌ల స్వగృహంలో పేద విద్యార్థులకు, ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఇల్లు కాలిపోయిన బాధితునికి ఆర్థిక సహాయం అందజేశారు. తెనాలికి చెందిన షేక్ హర్షిత్, ట్రిపుల్ ఐటి చదువుతున్న మౌనికలకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున, ఇల్లు కాలిపోయిన పతకమూరి వెంకటేశ్వర్లుకు రూ.3 వేల ఆర్థిక సహాయాన్ని పూర్ణకుమారి, గంగాధర్‌లు అందజేశారు. కార్యక్రమంలో దొడ్డపనేని సుధీర్, మండూరు శ్రీనివాసరావు, కైతేపల్లి రాంబాబు, వీరగంధం శ్రీనివాసరావు, చిలువోల్లంక చంద్రం, చేకూరి శివశంకరరావు, అమర్తలూరి బాబురావు, కొలకలూరు మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

చేనేత సంక్షేమమే ధ్యేయంగా వైసీపీ పాలన


చేనేత కార్మికులకు రాట్నాలు పంపిణీ చేస్తున్న మంత్రి నాగార్జున, ఎంపీ మోపిదేవి

భట్టిప్రోలు, జనవరి 11 : చేనేత కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా వైసీపీ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. మండలంలోని ఐలవరం గ్రామంలో పూర్తయిన సచివాలయం-1, వెల్‌నెస్ సెంటర్‌ల ప్రారంభం, రూ.76 లక్షలతో త్రీఫేజ్ విద్యుత్ ఆధునీకరణ పనులకు గురువారం మంత్రి నాగార్జున శంకుస్థాపన చేశారు. అనంతరం భట్టిప్రోలు, ఐలవరం క్లస్టర్ పరిధిలోని 100 మంది కార్మికులకు స్టాండు మగ్గాలు, 102 మందికి రాట్నాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వరికూటి అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు, ఎంపీపీ డి.లలితకుమారి, జడ్పీటీసీ టి.ఉదయభాస్కరి, గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకులు బి. ఉదయభాస్కర్, నాయకులు కె. పిచ్చియ్యశాస్త్రి, మాచర్ల హేమసుందరరావు, జొన్నాదుల శరత్, మాచర్ల తులసీ రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్వతీ అమ్మవారి హుండీ ఆదాయం లెక్కింపు

కొల్లూరు, జనవరి 11 : పార్వతీ అమ్మవారి హుండీ ఆదాయం రూ.1,20,455లు వచ్చినట్లు ఆలయ ఈవో అనుపమ గురువారం తెలిపారు. కొల్లూరులోని అనంత భోగేశ్వర మల్లేశ్వర స్వామి ఆలయంలో ఉన్న పార్వతీ అమ్మవారి దేవస్థానంలో హుండీని లెక్కించగా 2023 మే 8 నుంచి ఈనెల 10వ తేదీ వరకు రూ.1.20 లక్షలు భక్తులు కానుకల రూపంలో సమర్పించినట్లు ఈవో చెప్పారు. హుండీ లెక్కింపులో పాల్గొన్న భక్తులకు ఈవోతో పాటు పార్వతీ అమ్మవారి బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

అమృతలూరు, జనవరి 11 : కేంద్ర ప్రభుత్వం పేదల కోసం పలు పథకాలను అమలు చేస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూపారాణి అన్నారు. గురువారం అమృతలూరులో వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై అవగాహన కార్యక్రమం సర్పంచ్ దేవరకొండ రాము అధ్యక్షతన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను లబ్దిదారులకు అందించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి మౌనిక, ఆవుల అమర్‌నాథ్, పంచాయతీ కార్యదర్శి కుమార్, జెఏ తిరుమలరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జంపనిలో కూడారై ఉత్సవం

వేమూరు, జనవరి 11 : మండలంలోని జంపనిలో ఉన్న శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో ధనుర్మాస వ్రత పూజల్లో భాగంగా శుక్రవారం తెల్లవారు ఝామున కుడారై ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. చెన్నకేశవ స్వామికి గోదా అమ్మవారికి సుప్రభాత సేవ అనంతరం విశేష అర్చనలు పూజలు జరిపి తిరుప్పావై పఠనం అనంతరం గోదాకృష్ణుల పల్లకి ఉత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. కృష్ణునికి నివేదించిన పాయస అన్నాన్ని భక్తులకు వినియోగించడం జరుగుతుందన్నారు.

న్యాయస్థానం ఆదేశిస్తేనే నీరు-చెట్టు బిల్లులు!

- కోర్టు ధిక్కార వ్యాజ్యాలకు సిద్ధమైన రైతులు

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో 665 మండలాల్లో చేపట్టిన నీరు-చెట్టు కార్యక్రమంలో పనులు జరిగాయంటూ నిఘా సంస్థ నివేదికలు ఇస్తున్నా.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రం అవినీతి జరిగిందని ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. జల వనరుల శాఖ అంతర్గత నిఘా విభాగంతో సహా రాష్ట్ర విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కూడా 2015 నుంచి 2019 దాకా చేపట్టిన నీరు-చెట్టు కార్యక్రమంలో పనులు జరిగాయని నివేదికలు ఇచ్చాయి. మొత్తంగా రూ.18,265 కోట్ల మేర నీరు చెట్టు పథకం కింద పనులు చేపట్టారు. ఈ పనులకు రూ.1,277 కోట్లు చెల్లించేందుకు ఆర్థిక శాఖ అనుమతులు ఇచ్చింది. వాటిని 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం నిలిపివేసింది. ఈ పనులపై పంచాయతీరాజ్ శాఖతో విచారణ జరిపించింది. ప్రస్తుత డీజీపీ రాజేంద్రనాథరెడ్డి విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా ఉన్న సమయంలో దర్యాప్తు కూడా చేయించింది. పనులు జరిగాయని, కొన్నిచోట్ల ఇంజనీరింగ్ అధికారుల తప్పులున్నాయంటూ విజిలెన్స్ డైరెక్టరేట్ నివేదిక ఇచ్చింది. నివేదికలు క్లియర్‌గా ఉన్నా ప్రభుత్వం మాత్రం బిల్లులు చెల్లించడంలేదు. దీంతో 8,070 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు. అయినా ప్రభుత్వం చలించలేదు. రైతులు కోర్టు ధిక్కార పిటిషన్లు వేయడంతో 2022 మార్చి నుంచి 2023 డిసెంబరు దాకా రూ.1076 కోట్లు రైతుల ఖాతాల్లో వేసింది. మరో రూ.272 కోట్ల బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఈ బిల్లుల కోసం రైతులు మళ్లీ ధిక్కార పిటిషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు.

జగన్ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలి: ఆలపాటి

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): జగన్ నిజంగా మనిషైతే, ఆయనకు సిగ్గూ శరం ఉంటే అవినీతి కేసుల్లో తన నిర్దోషితత్వాన్ని నిరూపించుకోవాలని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సవాల్ విసిరారు. గురువారం మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ఏ నాయకుడిపైనా లేనన్ని పెద్ద కేసులు తనపై ఉన్నా... కోర్టుల విచారణకు హాజరు కాకుండా జగన్ కుంటిసాకులు చెబుతున్నారని విమర్శించారు.

అరాచకవాది పక్కన అవకాశవాది: నెట్టెం

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అహంకారంతో చంద్రబాబు, లోకేశ్‌లపై నిందలేసి, అమరావతిని హేళన చేసిన కేశినేని నానికి కాలమే సమాధానం చెప్తుందని మాజీ మంత్రి నెట్టెం రఘురామ్ అన్నారు. గురువారం టీడీపీ జాతీయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'నాని రెండోసారి ఎంపీగా గెలిచాక తానే విజయవాడకు అధిష్ఠానం అన్న విధంగా వ్యవహరించారు. తన స్వార్థం కోసం నేడు అరాచకవాది జగన్ పక్కన అవకాశవాది నాని చేరారు' అని నెట్టెం అన్నారు.

దళితులంటే నానికి ఎందుకు చులకన?: దేవదత్

ఎంపీ కేశినేని నాని ముందస్తు ప్రణాళికలతోనే టీడీపీని వీడారని తిరువూరు టీడీపీ ఇన్‌చార్జ్ శావల దేవదత్ ఆరోపించారు. 'తిరువూరులో జరిగిన రా.. కదలిరా బహిరంగ సభను అప్రతిష్ఠ పాల్జేసి తెలుగుదేశానికి, చంద్రబాబుకి చెడ్డపేరు తీసుకురావాలన్న దురుద్దేశంతోనే కేశినేని వ్యవహరించారు. సభా నిర్వహణ కోసం టీడీపీ ముందస్తుగా నిర్ణయించిన సన్నాహక సమావేశంలో తన అనుచరులతో వీరంగం సృష్టించారు. దళితుడినైన నన్ను కనీస గౌరవం లేకుండా ఏకవచనంతో మాట్లాడటం నిజం కాదా? దళితులంటే నానికి అంత చులకన ఎందుకు' అని నిలదీశారు.

స్థానిక నిధులు మరో 600 కోట్లు లాగేశారు

- వెంటనే పంచాయతీలకు నిధులు జమ చేయాలి: వైవీబీ

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్రానికి పంపిన 15వ ఆర్థిక సంఘం నిధుల్లో రూ.600 కోట్లు సర్కార్ లాగేసుకుంది. వెంటనే ఆ నిధులను స్థానిక సంస్థలకు జమ చేయాలి' అని ఏపీ పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రం రూ.988 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి పంపితే, రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను పంచాయతీలకు జమచేయకుండా రూ.393 కోట్లు మాత్రమే ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. లాక్కొన్న రూ.600 కోట్లను వెంటనే స్థానిక సంస్థలకు జమ చేయకపోతే రాజకీయాలకు అతీతంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలతో కలిసి తాడేపల్లిలోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించి తడాఖా చూపిస్తామని హెచ్చరించారు.

టీడీపీ కార్యాలయంలో వడ్డె ఓబన్న జయంతి వేడుకలు

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వడ్డెరల ఆరాధ్య దైవం వడ్డె ఓబన్న జయంతి కార్యక్రమాన్ని టీడీపీ జాతీయ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు, శాసన మండలి సభ్యులు దువ్వారపు రామారావు ఆధ్వర్యంలో వడ్డె ఓబన్న చిత్రపటానికి నివాళులర్పించారు. బీసీ సాధికార సమితి ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకటగురుమూర్తి, వడ్డెర సాధికార సమితి కన్వీనర్ వడ్డె వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వ్యూహం సినిమా వివాదంపై 22న తీర్పు

హైదరాబాద్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వ్యూహం సినిమాకు సెన్సార్‌బోర్డు జారీచేసిన సర్టిఫికెట్‌ను కొట్టేయాలని కోరుతూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. ఈ నెల 22న తీర్పు వెలువరిస్తామని జస్టిస్ సూరేపల్లి నందా ధర్మాసనం గురువారం పేర్కొంది.

యూట్యూబ్ ఇండియాకు సమన్లు

- జారీ చేసిన జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంస్థ
- తల్లులు-కుమారులపై అసభ్య వీడియోల పోస్టింగ్‌తోనే!

న్యూఢిల్లీ, జనవరి 11: తల్లులు-కుమారులపై కొన్ని చానెళ్లు అసభ్య వీడియోలు పోస్టింగ్ చేస్తున్న నేపథ్యంలో.. ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ మాధ్యమం యూట్యూబ్ ఇండియా హెడ్ (ప్రభుత్వ వ్యవహారాలు- ప్రజా విధానాలు) మీరా ఛట్‌కు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంస్థ (ఎన్‌సీపీసీఆర్) సమన్లు జారీ చేసింది. ఛట్ ఈ నెల 15న తమ ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించింది. సమన్లపై స్పందించకుంటే అరెస్టు తప్పదని హెచ్చరించింది. అసభ్య వీడియోల పోస్టింగ్.. పోక్సో చట్టం ఉల్లంఘనే అని, అశ్లీల వీడియోలు మైనర్లూ చూసేలా ఉండడం పిల్లల భద్రతకు తీవ్ర హానికరమని ఎన్‌సీపీసీఆర్ చీఫ్ ప్రియాంక్ కానుంగో ఆందోళన వ్యక్తం చేశారు. అశ్లీల కంటెంట్ తొలగింపుపై చేపట్టిన చర్యలు వెల్లడించాలని.. సంబంధిత వీడియోల జాబితాతో రావాలని నిర్దేశించారు. మరోవైపు తల్లీ-కొడుకుకు సంబంధించిన అసభ్య వీడియోను అప్‌లోడ్ చేసినందుకు యూట్యూబ్ ఇండియా ప్రతినిధులపై ముంబై సైబర్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది.

సీఐడీ విచారణకు ఎన్ఆర్ఐ యశ్

తిరుపతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన ఘటనలో నోటీసులు అందుకున్న ఎన్ఆర్ఐ యశ్ బొద్దులూరి విచారణ నిమిత్తం గురువారం తిరుపతిలోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి వచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన తల్లిని పరామర్శించేందుకు వచ్చిన ఆయన్ని గతనెలలో శంషాబాద్ విమానాశ్రయంలో సీఐడీ పోలీసులు అదుపులోకి తీసుకుని గుంటూరు సీఐడీ కార్యాలయానికి తరలించిన విషయం తెలిసిందే. అనంతరం ఈనెల 11న తిరుపతికి కార్యాలయానికి విచారణకు రావాలని 41ఏ సీఆర్పీసీ కింద యశ్‌కు సీఐడీ నోటీసులు జారీచేసింది.



సీఐడీ విచారణకు హాజరైన ఎన్ఆర్ఐ యశ్

తనిఖీలతో టోల్‌గేట్ల వద్ద రద్దీ

- హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు కార్ల బారులు

కంచికచర్ల, జనవరి 11: సంక్రాంతికి సొంతూళ్లకు వచ్చే వారితో హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై గురువారం వాహనాల రద్దీ ఏర్పడింది. హైదరాబాద్‌తో పాటు ఇతర తెలంగాణ జిల్లాల్లో స్థిరపడిన వారందరూ సంక్రాంతి పండగను కుటుంబ సభ్యులతో జరుపుకునేందుకు స్వగ్రామాలకు తరలివస్తున్నారు. విద్యా సంస్థలకు సెలవులివ్వటంతో భార్యాపిల్లలతో కలిసి సొంత కార్లలో వస్తున్నారు. హైదరాబాద్-విజయవాడ రూటులో జిల్లాలో చిల్లకల్లు, కీసర వద్ద టోల్‌గేట్లు ఉన్నాయి. తెలంగాణాలో మరో రెండు టోల్‌గేట్లు ఉన్నాయి. ఫాస్టాగ్ సదుపాయం ఉండటంతో కొద్ది నిమిషాల్లోనే వాహనాలు వాటి నుంచి బయటకు వెళ్లిపోతున్నాయి. అయితే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రెండు రోజుల నుంచి రాష్ట్ర సరిహద్దు గరికపాడు వద్ద, కీసర టోల్‌గేట్ వద్ద పోలీసులు కార్లను, ఇతర వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఒకవైపు రద్దీ, మరోవైపు తనిఖీ వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని వాహనదారులు అంటున్నారు. శుక్ర, శనివారాల్లో వాహనాల రద్దీ ఇంకా ఎక్కువగా ఉంటుందని టోల్‌గేట్ల నిర్వాహకులు చెబుతున్నారు.



- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయస్థాయి నాలుగో ర్యాంకు
- టాప్ టెన్‌లో విజయవాడ, తిరుపతి కూడా..

న్యూఢిల్లీ, విశాఖపట్నం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్-2023 పోటీలో విశాఖపట్నం జాతీయ స్థాయిలో నాలుగో ర్యాంకు దక్కింది. గురువారం ఢిల్లీలో కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి హరదీప్‌సింగ్‌పురీ ఈ అవార్డులను ప్రకటించారు. లక్షకుపైగా జనాభా కలిగిన నగరాల కేటగిరీలో 4,477 నగరాలు పోటీ పడగా 9,500 మార్కులకుగాను 9348.39 సాధించి ఇండోర్, సూరత్‌కు ఉమ్మడిగా మొదటి ర్యాంకు సాధించాయి. 9,240.3 మార్కులతో ముంబై మూడు, 8879.23 మార్కులతో విశాఖపట్నం నాలుగో స్థానంలో నిలిచాయి. ఏపీలో విజయవాడకు ఆరు, తిరుపతికి ఎనిమిదో ర్యాంకు దక్కాయి. తెలంగాణ నుంచి హైదరాబాద్ తొమ్మిదో స్థానంలో నిలిచింది. గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్(జీవీఎంసీ) తరఫున రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్, జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి అవార్డులను స్వీకరించారు. కాగా, స్వచ్ఛ సర్వేక్షణ్-2022లో నాలుగో ర్యాంకు సాధించిన విశాఖ నగరం...ఈ ఏడాది కూడా ఆ స్థానాన్ని నిలబెట్టుకుంది. కాగా, స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో ఏపీలోని మూడు నగరాలు టాప్ టెన్‌లో నిలిచాయి. క్లీన్ సిటీ కేటగిరిలో అఖిలభారత స్థాయిలో విశాఖపట్నం(4), విజయవాడ(6), తిరుపతి(8) ర్యాంకులు సాధించాయి. అలాగే, "ఫాస్ట్ మూవింగ్ సిటీ" విభాగంలో 5 స్టార్ రేటింగ్స్‌తో గుంటూరు 2వ ర్యాంక్ పొందింది. క్లీన్ సిటీ కేటగిరిలో జాతీయ స్థాయిలో 8వ ర్యాంకు పొందిన తిరుపతి పది లక్షల జనాభా కలిగిన పట్టణాల్లో రెండవ ర్యాంకులో నిలిచింది. విజయవాడ జాతీయ స్థాయిలో ఆరవ ర్యాంకు సాధించింది. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి సురేశ్ మాట్లాడుతూ ఏపీలోని నగరాలకు టాప్ టెన్‌లో మూడు ర్యాంకులు వచ్చాయని చెప్పారు.

ఆ కాంట్రాక్టర్‌పై ఎంత ప్రేమో!

- ఎప్పటి బిల్లులు అప్పుడే చెల్లింపు
- కాంట్రాక్టర్లకే కాకుండా వైసీపీ నేతలకూ చుక్కలు చూపిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- కానీ, ఆయనకు జాప్యం లేకుండా అప్‌లోడ్
- తేడా జరిగితే ఉన్నతాధికారులు లైన్‌లోకి..
- కేంద్ర దర్యాప్తు సంస్థలో అధికారిగా కాంట్రాక్టర్ బంధువు?
- ముఖ్యనేతకు అవసరం కాబట్టే పెద్దపీట

(నెల్లూరు - ఆంధ్రజ్యోతి)

చేసిన పనులకు బిల్లులు తెచ్చుకోవడమంటే ఒక పెద్ద విజయమే సాధించినట్లుగా తయారయ్యాయి రాష్ట్రంలో పరిస్థితులు. సాధారణ కాంట్రాక్టర్లకే కాకుండా వైసీపీ నేతలకు కూడా చుక్కలు కనిపిస్తున్నాయి. ఆఖరుకు ఎంపీ, ఎమ్మెల్యే వంటి ప్రజాప్రతినిధులు కూడా తాము చేసిన పనులకు బిల్లులు విడుదల చేయించుకునేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల దుస్థితే దీనికి నిదర్శనం. అయితే ఒక కాంట్రాక్టర్‌కు మాత్రం ఇటు బిల్లు అప్‌లోడ్ చేయడం.. అటు విడుదల చేయడం జరిగిపోతోంది. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో సుమారు రూ.300 కోట్ల వర్కులు చేస్తున్న ఈ కాంట్రాక్టర్‌కు చెల్లిస్తున్న బిల్లులను చూసి.... మిగిలిన కాంట్రాక్టర్లు, అధికారులు ఆశ్చర్యపోతున్నారు. ఈయన కన్నా ముందు చేసిన వర్కులకు మాత్రం రూపాయి కూడా బిల్లు విడుదల కాలేదు. ఆఖరుకు సోమశిల ఆప్రాన్ పనులు అత్యవసరంగా చేపట్టాలని హైపవర్ కమిటీ సూచించినా, ఆ పనులకు పెండింగ్ బిల్లులు చెల్లించడం లేదు. రాష్ట్రంలో ఉన్న పెద్ద కాంట్రాక్టర్లకు కూడా సాధ్యం కాని పని హైదరాబాద్‌కు చెందిన ఆ కాంట్రాక్టర్‌కు ఎలా సాధ్యమవుతోందని మిగిలిన కాంట్రాక్టర్లు ఆరా తీయగా అసలు గుట్టు బయటపడింది. సదరు కాంట్రాక్టర్ బంధువు ఓ కేంద్ర దర్యాప్తు సంస్థలో పనిచేస్తున్నారని సమాచారం. దీంతో ఆ కాంట్రాక్టర్ అవసరం ముఖ్య నేతకు ఎంతో ఉంది. ముఖ్య నేతకు సంబంధించిన కొన్ని కేసులను దర్యాప్తు చేస్తున్న ఆ కేంద్ర దర్యాప్తు సంస్థలో సదరు కాంట్రాక్టర్ బంధువు అధికారిగా ఉండడంతోనే హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్‌కు పెద్దపీట దక్కుతోందని చెప్పుకొంటున్నారు. కేంద్ర అధికారి ప్రాపకం కోసం ఈ కాంట్రాక్టర్‌ను మచ్చిక చేసుకొని ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నట్లు కాంట్రాక్టర్ల వర్గాలు చర్చించుకుంటున్నాయి. నెల్లూరులో రూ.42 కోట్లతో ఓ కాలువ ఆధునికీకరణ పనులు జరగ్గా ఇప్పటికి రూ.37 కోట్ల బిల్లులు సదరు కాంట్రాక్టరుకు చెల్లించారు. చివరి రెండు బిల్లులకుగాను మరో రూ.5 కోట్లు మాత్రమే పెండింగ్ ఉన్నాయి. అయితే ఇదే కాలువకు కొనసాగింపుగా ఉన్న మరో కాలువ పనులు రూ.5 కోట్లతో ఎప్పుడో పూర్తి చేసినా ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. అలానే ఈ కాంట్రాక్టర్ చేస్తున్న వర్కుల్లో ఇంకో కాలువ పనులు రూ.7 కోట్లు జరగ్గా అందులో రూ.4 కోట్లు ఇప్పటికే ఇచ్చేశారు. చివరగా పెట్టిన మరో బిల్లు రావాల్సి ఉంది. అయితే ఇదే కాలువ రెండో ఫేజ్ వర్కులను వేరే కాంట్రాక్టర్ ముందే చేసి బిల్లు పెట్టినా అది విడుదల కాలేదు. ముఖ్య నేతకు కావాల్సిన కాంట్రాక్టర్‌కు సంబంధించిన బిల్లులను కూడా ఆలస్యం లేకుండా అప్‌లోడ్ చేసేస్తున్నారు. ఏమాత్రం ఆలస్యమైనా రాష్ట్ర ఉన్నతాధికారులు లైన్లోకి వస్తారని బహిరంగంగానే చెప్పుకొంటున్నారు.

బంధం బలమైనదే!

కాలువ ఆధునికీకరణ కోసం తొలుత రూ.89 కోట్లతో 2019 డిసెంబరులో టెండర్లు పిలిచారు. మొత్తం ఐదుగురు కాంట్రాక్టర్లు బిడ్‌లు దాఖలు చేశారు. అందులో సదరు కాంట్రాక్టర్‌కే వర్కు దక్కేలా మిగిలిన నలుగురు కాంట్రాక్టర్లపై ప్రభుత్వ స్థాయిలో తీవ్ర ఒత్తిళ్లు వచ్చాయి. దీంతో ఆ నలుగురిలో ఒక్క కాంట్రాక్టర్ కూడా రివర్స్ టెండరింగ్‌లో పోటీపడలేదు. ముఖ్య నేతకు కావాల్సిన కాంట్రాక్టర్‌కు టెండరు దక్కింది. ఆ తర్వాత ఈ వర్కును రూ.89 కోట్ల నుంచి 110 కోట్లకు అంచనాలు పెంచినట్లు తెలిసింది. కానీ ఈ విషయాలు బయటపెట్టేందుకు అధికారులు భయపడిపోతున్నారు. కాగా వరద ముంపు రక్షణకై మట్టి కట్ట నిర్మాణానికి సుమారు రూ.100 కోట్లతో రెండేళ్ల క్రితం టెండర్లు పిలిచారు. కానీ ముఖ్య నేతకు కావాల్సిన కాంట్రాక్టర్‌కు కాకుండా మరో కాంట్రాక్టర్‌కు ఈ వర్కు దక్కింది. దీంతో ఏకంగా ఈ టెండర్‌నే రద్దు చేశారు. ఈ దఫా మట్టి కట్ట కాదు కాంక్రీట్ వాల్ అంటూ మళ్లీ టెండర్ పిలిచారు. ఈసారి ఎలాగైనా ఆ కాంట్రాక్టర్‌కే టెండర్ దక్కేలా ప్రయత్నాలు జరిగాయి. మొదట దఫా టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఈ దఫా పోటీలో లేకుండా ఏకంగా ఓ ప్రజాప్రతినిధి బెదిరింపులకు దిగారు. దీంతో కాంట్రాక్టర్ ఆ ప్రజాప్రతినిధిపై కేసు కూడా పెట్టారు. ఎన్ని జరిగినా చివరకు అనుకున్న విధంగా ముఖ్య నేతకు కావాల్సిన కాంట్రాక్టర్‌కు పనులు దక్కేలా చేశారు. ఇప్పుడు ఆ వర్కును మళ్లీ డిజైన్ మార్చారు. దీంతో అంచనాలు పెరిగిపోయాయి. ఇదే విధంగా మరో కాలువ ఆధునికీకరణకై సుమారు రూ.40 కోట్లతో రెండేళ్ల క్రితం టెండర్లు పిలిచారు. ఇక్కడ కూడా మరో కాంట్రాక్టర్ పోటీకి రాకుండా ముఖ్య నేతకు కావాల్సిన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. సదరు కాంట్రాక్టర్‌కు ముఖ్యనేతతో ఉన్న బంధం బలాన్ని తెలిపే ఇలాంటి ఉదంతాలెన్నో నెల్లూరు జిల్లాలో వినిపిస్తున్నాయి.

> "మంగళగిరి అభివృద్ధికి సీఎం రూ.1200 కోట్లు కేటాయిస్తామన్నారు. కానీ రూ.125 కోట్లకు కుదిస్తూ జీవో ఇచ్చారు. కానీ నిధులు మాత్రం విడుదల కాలేదు. ధనుంజయరెడ్డితో చాలా సార్లు మాట్లాడినా డబ్బులు విడుదల కాలేదు. కాంట్రాక్టర్ల నుంచి తీవ్ర ఒత్తిడి వచ్చింది. స్వయంగా నేనే అప్పులు తీసుకొచ్చి ఇచ్చాను. ఇలాంటి పరిస్థితుల్లో నేను ఏం చేయాలి?"
>
> **- మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆవేదన**
>
> "రోడ్లు వేశాం. రోడ్డున పడ్డాం. వర్కులు చేసేందుకు ఆస్తులు అమ్ముకొని, అప్పులు తెచ్చాం. కానీ దీర్ఘకాలంగా బిల్లులు చెల్లించడం లేదు. ఇది చాలా దుర్మార్గం. మా కుటుంబాలు విలవిల్లాడుతున్నాయి. కొందరికే బిల్లులు చెల్లిస్తూ మిగిలిన వారిపై వివక్ష చూపుతున్నారు. ఇటువంటి పరిస్థితులు ఎప్పుడూ చూడలేదు"
>
> **- ఇటీవల విజయవాడలో చేసిన ఆందోళనల్లో కాంట్రాక్టర్ల ఆక్రోశం**

దర్యాప్తు చేతకాదా.?

- ఈసీతో మాట పడ్డాం, ఏమి చెబుతారు?
- తిరుపతి పోలీసులకు డీజీపీ ఆఫీస్ క్లాస్

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): 'మీరందరూ పోలీసులే కదా! శాంతి భద్రతలు, దర్యాప్తు పోలీసు డ్యూటీలో ముఖ్యం. మరి దర్యాప్తు చేతకాదా? మీ నిర్లక్ష్యం వల్ల ఎన్నికల కమిషన్‌తో మాట పడ్డాం, ఏమని సమాధానం చెబుతారు' అంటూ పోలీసు ఉన్నతాధికారి తిరుపతి పోలీసులకు క్లాస్ పీకారు. తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి, డీఎస్పీలు, సీఐలుసహా పన్నెండు మంది పోలీసు అధికారులకు మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో గురువారం చీవాట్లు పెట్టారు. ఎన్నికల వాతావరణం నెలకొనడంతో రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర ఎన్నికల కమిషన్ మూడు రోజులపాటు విజయవాడలో జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశం నిర్వహించింది. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక నుంచి వస్తోన్న మద్యం అక్రమ రవాణాను అరికట్టడంలో విజయవాడ పోలీస్ కమిషనర్ క్రాంతి రాణాతోపాటు అనంతపురం ఎస్పీ అన్బురాజన్‌కు అక్షింతలు వేసింది. అంతకన్నా సీరియస్‌గా తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నిక సందర్భంగా నమోదైన ఎన్నికల అక్రమాలకు సంబంధించిన కేసుల దర్యాప్తులో స్థానిక పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై సీఈసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ఎన్నికల కమిషన్ అంటే అంత లెక్కలేనితనమా..? పక్షపాతం చూపిస్తామంటే కుదరదు. అటువంటి ఆలోచన ఉంటే వెళ్లిపోండి. ఎన్నికల కమిషన్ నిఘా పెట్టి వెంట పడుతుంది. వెంటనే బై ఎలక్షన్ కేసులపై ఏమి చేశారో నివేదిక ఇవ్వండి' అని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వ్యాఖ్యల్ని సీరియస్‌గా తీసుకున్న రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి తిరుపతి ఉప ఎన్నికల్లో నమోదైన కేసుల దర్యాప్తుపై సమీక్షించారు. తిరుపతి జిల్లా ఎస్పీతో పాటు ఇతర అధికారులను డీజీపీ కార్యాలయానికి పిలిపించారు. ముఖ్యమంత్రి జగన్ వ్యక్తిగత వైద్యుడైన గురుమూర్తిని ఎంపీగా గెలిపించుకోవడానికి రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పలు ఉల్లంఘనలకు పాల్పడ్డారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు చెందిన వేలాది మంది వైసీపీ కార్యకర్తల్ని తిరుపతికి తీసుకొచ్చి దొంగ ఓట్లు వేయించారంటూ టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల కమిషన్‌కు అప్పట్లో ఫిర్యాదు చేశారు. తిరుపతి జిల్లా పరిధిలో పదుల సంఖ్యలో పోలీసు కేసులు నమోదయ్యాయి. ఉప ఎన్నిక అనంతరం ఎఫ్ఐఆర్ కాపీలను పక్కన పడేసిన పోలీసులు దర్యాప్తు పూర్తిగా ఆపేశారు. దీంతో ఆయా కేసుల వివరాలతో, కేసులు ఏ స్టేషన్ పరిధిలో నమోదయ్యాయో వాటి ఎస్‌హెచ్‌వోలను సైతం డీజీపీ పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. శాంతిభద్రతల ఏడీజీ శంకబ్రత బాగ్చి ఈ కేసులన్నింటిపై సుదీర్ఘంగా సమీక్షించి వీలైనంత త్వరగా దర్యాప్తు పూర్తి చేయాలని ఆదేశించినట్లు సమాచారం.

హిందూమతంపై కాంగ్రెస్ వ్యతిరేకత బహిర్గతం

- మోదీపైన ఆ పార్టీ నేతలకు అసూయ, ద్వేషం: బీజేపీ

న్యూఢిల్లీ, జనవరి 11: అయోధ్యలో రామ మందిరం ప్రతిష్ఠ కార్యక్రమానికి తమ పార్టీ అగ్రనేతలు హాజరు కావడం లేదన్న కాంగ్రెస్ నిర్ణయాన్ని బీజేపీ తప్పుబట్టింది. ఇది భారత దేశ సంస్కృతి, హిందూ మతం పట్ల ఆ పార్టీకి అంతర్లీనంగా ఉన్న వ్యతిరేకతను బహిర్గతం చేసిందని ఆరోపించింది. ప్రధాని మోదీపై అసూయ, ద్వేషంతో పాటు ఆత్మన్యూనతా భావం వంటి కారణాలతో దేశాన్ని వ్యతిరేకించే స్థాయికి కాంగ్రెస్ వెళ్లిందని, ఇప్పుడు ఏకంగా దేవుడినే వ్యతిరేకిస్తోందని బీజేపీ అధికార ప్రతినిధి సుధాన్షు త్రివేది ధ్వజమెత్తారు. భారతీయ సంప్రదాయాలు, సంస్కృతి, అత్యున్నత విలువలకు అయోధ్యలోని రామమందిరం ప్రతీకగా పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్‌కు, అలాంటి భావజాలమే ఉన్న దాని మిత్రపక్షాలకు అతివాద రాజకీయాలే ముఖ్యమన్నారు. మరోవైపు కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయాన్ని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య సమర్థించారు. మతపరమైన కార్యక్రమాన్ని బీజేపీ నేతలు రాజకీయ వ్యవహారంగా మార్చారని ఆరోపించారు. దీనికి నిరసనగా ఆలయ ప్రతిష్ఠను నాలుగు శంకరాచార్య మఠాల పీఠాధిపతులు బహిష్కరించారని చెప్పారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధాన్ని రాజేశాయి. హిందుత్వకు కాంగ్రెస్ ఎప్పుడూ వ్యతిరేకమేనని కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు సీటీ రవి మండిపడ్డారు. "సోమనాథ్ ఆలయాన్ని సర్దార్ పటేల్, బాబూ రాజేంద్రప్రసాద్, కేఎం మున్షీ పునర్నిర్మించారు అప్పుడు ప్రధానిగా ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ, ఆ ఆలయాన్ని సందర్శించనే లేదు. అలాంటప్పుడు ప్రస్తుత కాంగ్రెస్ నాయకత్వం అయోధ్యకు ఎలా వెళ్తుంది? ముందు తమకు ఆహ్వానం అందలేదన్నారు. అది అందిన తర్వాత దానిని అంగీకరించడానికి నిరాకరిస్తున్నారు" అని రవి ధ్వజమెత్తారు.

రామమందిర ప్రతిష్ఠకు అద్వానీ: వీహెచ్‌పీ

రామ జన్మభూమి ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన బీజేపీ అగ్రనేత అద్వానీ(96) అయోధ్యలో రామమందిర ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరు కానున్నారని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అధ్యక్షుడు అలోక్ కుమార్ ప్రకటించారు. ఈ కార్యక్రమానికి వస్తానని అద్వానీ చెప్పారని, అవసరమైతే ఆయన కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. తాను కూడా అయోధ్యకు రావడానికి ప్రయత్నిస్తానని పార్టీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషీ చెప్పారన్నారు. రామమందిరం ట్రస్టు ఆహ్వానాన్ని కాంగ్రెస్ అగ్రనేతలు తిరస్కరించడంపై అలోక్ స్పందించారు. ప్రధాని మోదీని ఆహ్వానించిన విధంగానే ప్రతిపక్ష నేతలకూ ఆహ్వానాలు పంపామన్నారు. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాతో పాటు అన్ని పార్టీల అధ్యక్షులనూ ఆహ్వానించామని తెలిపారు. అయోధ్యకు రావాలా, వద్దా అనే విషయాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని అలోక్ పేర్కొన్నారు.

సరయూ నది ఒడ్డున 'రామాయణ ఆధ్యాత్మిక వనం'

- వనవాసంలో శ్రీరాముడి ప్రయాణ విశేషాలతో ప్రాజెక్టు

న్యూఢిల్లీ, జనవరి 11: అయోధ్యను సందర్శించే భక్తులు నగరంలోని సరయూ నది ఒడ్డున నిర్మితమవుతున్న 'రామాయణ ఆధ్యాత్మిక వనాన్ని' సందర్శించడం ద్వారా శ్రీరాముడి 14ఏళ్ల వనవాసం గురించి మరిన్ని విశేషాలు తెలుసుకోవచ్చు. రామాయణ వైభవాన్ని ప్రదర్శించే ఓపెన్ ఎయిర్ మ్యూజియంను తలపించేలా ఈ వనం పర్యావరణహితంగా ఉండనుంది. అయోధ్య మాస్టర్ ప్లాన్‌లో భాగంగా దీన్ని సిద్ధం చేస్తున్నారు. శ్రీరాముడు, రామాయణం, అయోధ్యతో పాటు సరయూ నది కూడా హిందూమతం నుంచి విడదీయరాని భాగమని అయోధ్య పునరాభివృద్ధి ప్రాజెక్టు చీఫ్ ప్లానర్ దీక్షు కుక్రేజా అన్నారు. నది ఒడ్డు వెంబడి ప్రతిపాదిత ఆధ్యాత్మిక వనాన్ని రామాయణం ఇతివృత్తంగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో రాముడు వనవాస సమయంలో చేసిన ప్రయాణాన్ని ప్రత్యేకంగా వివరించినట్లు తెలిపారు. ఈ వనం భక్తులతో పాటు పర్యాటకులను, ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తుందని చెప్పారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం రూ.85వేల కోట్లకు పైగా పెట్టుబడులతో అయోధ్య నగర పునర్నిర్మాణం పదేళ్లలో పూర్తికానుంది.

22న అయోధ్యకు 100 చార్టర్డ్ విమానాలు: సీఎం యోగి

రామమందిర ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించే జనవరి 22న సుమారు 100 వరకూ చార్టర్డ్ విమానాలు అయోధ్య విమానాశ్రయంలో ల్యాండ్ అవుతాయని భావిస్తున్నామని ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. గతేడాది డిసెంబరు 30న ప్రధాని ప్రారంభించిన మహర్షి వాల్మీకి విమానాశ్రయం సామర్థ్యానికి ఇదో పరీక్షగా పేర్కొన్నారు. రాష్ట్రానికి నాలుగో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఇచ్చినందుకు మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అయోధ్య నుంచి అహ్మదాబాద్‌కు ఇండిగో విమాన సర్వీసును ఆయన గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఢిల్లీ నుంచి అయోధ్యకు ఇప్పటికే విమాన సదుపాయం ఉండగా ఇకపై అహ్మదాబాద్‌కు కూడా నేరుగా సర్వీసులు నడుస్తాయి. ఇక ఈ నెల 15నుంచి ముంబైకి కూడా విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి.

అంబేడ్కర్ కుటుంబ సభ్యులకు అయోధ్య ఆహ్వానం

- జగజ్జీవన్‌రాం, కాన్షీరాంల వారసులకు కూడా..
- సీఎంలలో ఒక్క యోగికి మాత్రమే

న్యూఢిల్లీ, జనవరి 11: అయోధ్య రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి ప్రముఖ దళిత నాయకులైన బి.ఆర్. అంబేడ్కర్, బాబూ జగజ్జీవన్‌రాం, కాన్షీరాంల కుటుంబ సభ్యులకు నిర్వాహకులు ఆహ్వానాలు పంపారు. ఈ నెల 22న జరగనున్న ఈ ఉత్సవానికి రావాల్సిందిగా కోరుతూ ఆహ్వానాలు పంపిన ప్రముఖుల వివరాలను విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మినహా ఏ ఇతర ముఖ్యమంత్రికీ ఆహ్వానం పంపలేదు. అన్ని పార్టీల అధ్యక్షులకు ఆహ్వానాలు పంపినా ఏ ఒక్క కేంద్ర మంత్రికిగానీ, రాష్ట్ర మంత్రికిగానీ, ఇతర రాజకీయ నాయకులకుగానీ ఇందులో చోటు దక్కలేదు. రామజన్మభూమి ఉద్యమంలో పాల్గొని ప్రాణాలు కోల్పోయిన కరసేవకుల కుటుంబ సభ్యులకు ఆహ్వానాలు అందాయి. ముగ్గురు విశ్రాంత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తులు, పదవీ విరమణ చేసిన ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ చీఫ్‌లు, మాజీ రాయబారులు, సివిల్ సర్వెంట్స్, మాజీ ఐపీఎస్ అధికారులు కూడా ప్రముఖుల జాబితాలో ఉన్నారు. అయోధ్యలోని అన్ని పార్టీల ప్రతినిధులకు ఆహ్వానపత్రికలు అందాయి. గిరిజన, సంచార జాతుల ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపార వేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, నోబెల్, భారతరత్న, పరంవీర్ చక్ర, పద్మ అవార్డుల గ్రహీతలను ఆహ్వానించనున్నారు. ప్రముఖ ఆలయాల ధర్మకర్తలు, 150 సంప్రదాయాల పూజారులు, నేపాల్‌కు చెందిన సంత్ సమాజ్ ప్రముఖులు, జైన, బౌద్ధ, సిక్కు మతాల ప్రతినిధులు, 50 దేశాలకు చెందిన 55 హిందూ సంఘాల ప్రతినిధులనే కాకుండా దాతలను ఆహ్వానించారు. వారందరికీ అయోధ్యలో ఉచిత వసతి, రవాణా, భోజన సౌకర్యాలు కల్పించనున్నారు.

రుణాల మంజూరుకు మరింత సహకరించాలి

- బ్యాంకర్లకు ఆర్థిక మంత్రి బుగ్గన విజ్ఞప్తి

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ పథకాల లబ్ధిదారులకు రుణాల మంజూరు విషయంలో బ్యాంకర్లు మరింత తోడ్పాటు అందించాలని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కోరారు. అమరావతి సచివాలయంలో రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ 225వ సమావేశం గురువారం జరిగింది. మంత్రి మాట్లాడుతూ.. "ఈ ఏడాది 3లక్షల మంది కౌలురైతులకు రూ.4వేల కోట్ల రుణాలివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నా, 75వేల మందికే ఇచ్చారు. మిగతావారికీ రుణాలివ్వాలి. టిడ్కో గృహాలకు పెద్దఎత్తున రుణాలివ్వాలి. విద్యారుణాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ముద్రా, ఇతర కేంద్ర ప్రయోజిత పథకాల లక్ష్యాలు సాధించాలి' అని సూచించారు. ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్, యూబీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నితీష్ రంజన్, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ రవీంద్రబాబు, ఆర్బీఐ జీఎం రాకేశ్ మాట్లాడారు. కాగా, 2023-24 బ్యాంకుల వార్షిక రుణ ప్రణాళికలో స్వల్పకాలిక పంట రుణాలు రూ.లక్షా48వేల కోట్లు ఇవ్వాల్సి ఉండగా, ఖరీఫ్‌లో రూ.82వేల కోట్లతో 56% సాధించినట్లు బ్యాంకర్లు వివరించారు. దీర్ఘకాల రుణాల్లో రూ.68వేల కోట్ల లక్ష్యంలో రూ.43వేల కోట్లతో 58%, అగ్రి ఇన్‌ఫ్రా, ఎక్స్‌పోర్టుకు రూ.15వేల కోట్ల రుణాల్లో 101% లక్ష్యాన్ని సాధించగా, ఎంఎస్ఎంఈ రుణాల్లో రూ.69వేల కోట్లకు రూ.53వేల కోట్లతో 78%, ముద్రా రుణాల్లో 77%, పీఎంఎఫ్ఎంఈ 83%, పీఎం స్వానిధి 96%, స్టాండ్ అప్ ఇండియా రుణాల్లో 93% లక్ష్యాలు సాధించినట్లు చెప్పారు.

బాబు చేస్తే ఒప్పు.. మేం చేస్తే తప్పా..?

మాజీ సీఎం చంద్రబాబు అప్పు చేస్తే తప్పు కాదు.. మేం చేస్తే తప్పా అని మంత్రి బుగ్గన ప్రశ్నించారు. చంద్రబాబు రాజకీయంగా అనుసరించిన విధానాల వల్లే రాష్ట్రంపై అప్పుల భారం పెరిగిందని విలేకరులతో అన్నారు. 'రాష్ట్ర ప్రభుత్వ అప్పులపై టీడీపీ నేతలు తలోరకంగా మాట్లాడుతున్నారు. చంద్రబాబు రూ.13 లక్షల కోట్లు అంటే, యనమల రూ.10 లక్షల కోట్లు అంటారు. ఇంకొకరు రూ.7 లక్షల కోట్లంటారు. అసలు రాష్ట్రంపై అప్పు ఎంత ఉందో టీడీపీ నేతలకే స్పష్టత లేదు. రూ.లక్షా 70 వేల కోట్ల బిల్లులు పెండింగ్ ఉన్నాయని వారికి ఎవరు చెప్పారు? కేంద్రం, కాగ్, ఆర్బీఐ, బ్యాంకులకు తెలియకుండా అప్పులు చేయడం కుదరదని బాబు, యనమలకు తెలియదా? సీపీఎస్ రద్దు చేస్తే, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది. అందుకే జీపీఎస్ అమలు చేస్తాం. కేంద్రం నుంచి మేం ఏదైనా సాధిస్తే బీజేపీతో కుమ్మక్కయ్యారంటారు. ప్రత్యేక హోదా తేకపోతే.. మా వల్ల కాలేదంటారు. తండ్రీకొడుకులు ఊరూరూ తిరిగి వైసీపీ ఎమ్మెల్యేలకు పేర్లు పెడుతున్నారు. వారిద్దరికీ మేం పేర్లు పెట్టలేమా? లోకేశ్‌ను రేలంగి అని అనలేమా' అని ప్రశ్నించారు. సీపీఎస్ రద్దు, మెగా డీఎస్సీ, ఏటా జాబ్ కేలెండర్ హామీలు ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించగా.. 95 శాతం హామీలు నెరవేర్చితే, మిగతా 5 శాతం గురించే మీడియా హైలైట్ చేయడం సరికాదని బుగ్గన అన్నారు.

పదోన్నతుల్లో 'సుప్రీం' ఆదేశాలు పాటించండి

- విద్యుత్ సంస్థలకు హైకోర్టు ఆదేశం.. తీర్పుపై ఉద్యోగుల హర్షం

అమరావతి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): పదోన్నతుల్లో సుప్రీం కోర్టు మార్గదర్శకాలు, ఆదేశాలను పాటించాల్సిందేనని విద్యుత్ సంస్థలకు హైకోర్టు స్పష్టం చేసింది. పదోన్నతులపై విద్యుత్ సంస్థల యాజమాన్యాలు అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు.. ఉద్యోగులకు పదోన్నతుల విషయంలో నాగరాజు, జోర్నైల్ సింగ్, బీకే పవిత్ర-1 కేసుల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను పాటించాల్సిందేనని జస్టిస్ వి.సుజాత తీర్పును వెలువరించారు. రాష్ట్ర విద్యుత్ ఓసీ ఉద్యోగ సంఘాలు పదోన్నతుల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును విద్యుత్ సంస్థలు అమలు చేయడం లేదంటూ హైకోర్టును ఆశ్రయించింది. పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలుచేయడంలో గతంలోనే సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలతో కడిన ఆదేశాలను ఇచ్చినందున దానిని కచ్చితంగా అమలు చేయాల్సిందేనని హైకోర్టు ఇటీవల తీర్పును వెలువరించింది. భవిష్యత్తులో కచ్చితంగా సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకే పదోన్నతులు ఇవ్వాలని సూచించింది. హైకోర్టు ఆదేశాలపై విద్యుత్ సంస్థల ఉద్యోగుల రాష్ట్ర ఓసీ సంఘం ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

బంగ్లా ప్రధానిగా హసీనా ప్రమాణ స్వీకారం

ఢాకా, జనవరి 11: బంగ్లాదేశ్ ప్రధానిగా అవామీ లీగ్ నేత షేక్ హసీనా (76) గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. దేశ 12వ ప్రధానిగా ఆమె చేత అధ్యక్షుడు మహమ్మద్ షహాబుద్దీన్ ప్రమాణం చేయించారు. దీంతో ఆమె 5సార్లు ప్రధాని పదవిని చేపట్టినట్టయింది. వరుసగా 4సార్లు ప్రధాని కావడం విశేషం. తొలిసారిగా 2009లో ప్రధాని అయ్యారు. ప్రస్తుతం ప్రపంచంలోనే ఎక్కువ కాలంపాటు అధికారంలో కొనసాగుతున్న మహిళా ప్రభుత్వాధినేతగా గుర్తింపు పొందారు. ఆమెతో పాటు 25 మంది మంత్రులు, 11 మంది సహాయ మంత్రులు ప్రమాణం చేశారు.

కళాకారులకు ప్రాణంపోస్తున్న కళాపరిషత్‌లు

- సినీ నటుడు రఘుబాబు
- అనంతవరంలో నాటికల పోటీలు ప్రారంభం

యద్దనపూడి(మార్టూరు), జనవరి 11: గ్రామీణ ప్రాంతాలలో కళాపోషకులు నిర్వహించే కళాపరిషత్‌లు రంగస్థల కళాకారులకు ప్రాణం పోస్తాయని సినీ నటుడు రఘుబాబు అన్నారు. యద్దనపూడి మండలంలోని అనంతవరం గ్రామంలో గురువారం రాత్రి ఎన్టీఆర్ కళాపరిషత్ నాటికల పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలను ఒంగోలు మాజీ ఎమ్మెల్యే, ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభా వేదికపై కందిమళ్ల సాంబశివరావు అతిథులను ఆహ్వానించగా, కళాపరిషత్ అధ్యక్షుడు గుదే పాండు రంగారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా నాటకరంగ పరిశోధకులు మన్నె శ్రీనివాసరావు విచ్చేశారు. సన్మాన గ్రహీత సినీ నటుడు రఘుబాబు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా కళాకారులకు నిలయమన్నారు. అంతకుముందు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు కార్యక్రమంలో గుదే తారక రామారావు, కొరటాల వంశీ , తదితరులు పాల్గొన్నారు.


సినీ నటుడు రఘుబాబును సత్కరిస్తున్న ఈదర హరిబాబుతో కళాపరిషత్ సభ్యులు


కొత్త పరిమళం నాటికలోని ఓ సన్నివేశం

తొలి ప్రదర్శనగా శ్రీకాకుళం జిల్లా శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం వారు కొత్త పరిమళం ప్రదర్శించారు. మనుషులలో మానవత్వం దాగి ఉంటుందని, మానవత్వం బయటపెడితే అందమైన ప్రపంచాన్ని చూడవచ్చునని కథా రచయిత కాంద్రేగుల శ్రీనివాసరావు రాసిన నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు

- టిడ్కో ఇళ్లు పూర్తి చేసేవిధంగా చర్యలు
- వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి


టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి

అద్దంకి, జనవరి 11: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయటం జరుగుతుందని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం హనిమిరెడ్డి అన్నారు. ఈనెల 6న ఆంధ్రజ్యోతిలో ప్రభుత్వ భూమి కబ్జాకు రంగం సిద్ధం, గురువారం టిడ్కో ఇళ్ల పంపిణీ ఇక లేనట్టేనా! శీర్షికలన ప్రచురితమైన కథనాలకు హనిమిరెడ్డి, తహసీల్దార్ సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు స్పందించారు. శింగరకొండ సమీపంలో ఎర్రకుంట భూమిని వైసీపీ నాయకులు ఆక్రమించేందుకు చదును చేస్తున్న నేపథ్యంలో ఆంధ్రజ్యోతిలోకథనం ప్రచురితమైంది. దీంతో గురువారం సాయంత్రం పరిశీలించి ఆక్రమణకు సిద్ధమవుతున్నట్లు గుర్తించారు. చదును చేస్తున్న వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని, తగు నివేదిక ఇస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కఠిన చర్యలు తీసుకునేవిధంగా చర్యలు చేపడతానని హనిమిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ భూమి ఆక్ర మణలకు గురికాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం టిడ్కో ఇళ్లను పరిశీలిం చారు. పనులు నిలిచిపోవటానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు జగనన్న కాలనీలలో స్థలాలు, ఇళ్ల మంజూరుకు అవకాశం లేనందున ఇబ్బందులు పడుతున్నారని అధికారులు వివరించారు. టిడ్కో గృహాల నిర్మాణ పనులు పర్యవేక్షించే ఉన్నతాధికారులతో హనిమిరెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, కోట శ్రీనివాసకుమార్, జాగర్లమూడి యలమందరావు, గుంజి కోటేశ్వరరావు, వీరయ్య, గోపాలరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రాఘవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండలో దశ సహస్ర కదళీ ఫలార్చన

అద్దంకి, జనవరి 11: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా గురువారం దశ సహస్ర కదళీ ఫలార్చన పూజ వైభవంగా జరిగింది. ఉదయం ప్రాతఃకాల సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం, అభిషేకం నిర్వహించారు. 11 ఆవృత్తములుగా వేదపండితులు, పూజారులు పదివేల అరటిపండ్లతో పూజ నిర్వహించారు. ఉభయదాతలుగా గుంటూరుకు చెందిన శ్రీ న్యూ మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ అధినేత పొనకాల శ్రీనివాసరావు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండపం నిర్మాణానికి హైదారాబాద్‌కు చెందిన వాకా వెంకటరెడ్డి, అరుణ దంపతులు గురువారం 1,01,116 రూపాయల చెక్కును ఈవో సుభద్రకు అందజేశారు.


అరటి పండ్లతో ప్రసన్నాంజనేయస్వామి అలంకరణ

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

అద్దంకి, జనవరి 11: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వృద్ధుడు పురుగు మందుతాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బొమ్మనంపాడుకు చెందిన కామేపల్లి వెంకటరావు(60) గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ బుధవారం రాత్రి పురుగు మందు తాగాడు. ఒంగోలు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

పంగులూరు, జనవరి 11: మండలంలోని భగవాన్‌రాజుపాలెం, రామకూరు గ్రామాల మధ్య గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జనకవరం గ్రామానికి చెందిన కనుమూరి సునీల్ (35) అనే యుకుడు మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు.. జనకవరం నుంచి కంకర కోసం ట్రాక్టర్‌పై డ్రైవర్‌తో కలసి సునీల్ రామకూరు బయలుదేరాడు. భగవాన్ రాజుపాలెం దాటి రామకూరువైపు వెళుతున్న సమయంలో రోడ్డుపై గుంతలు తప్పించే క్రమంలో డ్రైవర్ బ్రేక్ వేయగా ఆ కుదుపునకు ఇంజన్‌పై కూ ర్చున్న సునీల్ ట్రాక్టర్ చక్రం కింద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ తాటాకు చప్పుళ్లకు బెదిరేదిలేదు!

- ఇళ్లకు నోటీసులు అంటించడంపై అంగన్‌వాడీలు ఆగ్రహం

అద్దంకిటౌన్, జనవరి 11: ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడితే బెదిరేది లేదని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ జిల్లా సభ్యురాలు జి.శారద హెచ్చరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యలు పరిష్కారం కోసం చేపట్టిన నిరవధి క సమ్మె గురువారం 31వ రోజుకు చేరుకుంది. తహసీల్దార్ కార్యాలయం వద్ద చేప ట్టిన ధర్నాకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.తిరుపతిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం జారీచేసిన షోకాజ్ నోటీసులు అంగన్‌వాడీ కేంద్రాలకు అంటించకుండా, కార్యకర్తల ఇళ్లకు అంటించడం దుర్మార్గమన్నారు. కేంద్రాలకు అంటించాల్సిన నోటీసులను మా ఇళ్లకు ఎలా అంటిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటీసులు తీసుకోని కార్యకర్తలపై అధికారులు బెదిరింపులకు పాల్పడడంతో విషయం తెలుసుకున్న సీఐటీయూ, అంగన్‌వాడీ కార్యకర్తలు మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా చేపట్టారు.

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులుతో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మాట్లాడారు. నోటీసులను ఇళ్లకు అంటించడం, కార్యకర్తలను బెదిరించ డం ఏమిటని ప్రశ్నించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చేస్తున్నామని కమిషనర్ చెప్పారు. కార్యకర్తలపై బెదిరింపులకు పాల్పడవద్దని వినతిపత్రం అందజేసేందుకు సంఘ నాయకులు ప్రయత్నించగా, మున్సిపల్ కమిషనర్ దానిని తీసుకోకుండా తహసీల్దార్‌కు ఇ చ్చుకోండని అన్నారు. దీంతో సంఘ నాయకలు, అంగన్‌వాడీ కార్యకర్తలు మేము కేం ద్రాలలో లేకపోతే ఇళ్లకు వచ్చి అంటిస్తున్నారని, అదేవిధంగా కమిషనర్ తీసుకోక పోతే ఆయన కార్యాలయానికి వినతి పత్రం అంటించాలని, ఆమేరకు అంటించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా తరలివెళ్లారు.

ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలి

చీరాలటౌన్, జనవరి 11: అంగన్‌వాడీలపై ఎస్మాను ప్రయోగించడం అన్యాయమని, వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ ప్రతినిధులు డిమాండ్ చేశారు. గతకొంత కాలంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నారు. గురువారం పట్టణంలో సీఐటీయూ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వసంతరావు, ఎల్.జయరాజ్, గూడూరి శివరామప్రసాద్, మధు, ఎస్.బాబురావు, శంకర్, అంజనేయులు, సురేష్, చెంచయ్య, సుకన్య, ఐవీ ప్రసాద్ పాల్గొన్నారు.

సెమీస్‌కు చేరిన వైజాగ్, చెన్నై జట్లు

- ఉత్కంఠభరితంగా సాగుతున్న క్రికెట్ పోటీలు


సౌత్‌జోన్‌సీసీ చెన్నై-కోకా ఇన్‌ఫ్రా లెవెన్ హైదరబాద్ మధ్య జరుగుతున్న మ్యాచ్

మేదరమెట్ల , జనవరి 11: రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీభమర సంక్రాంతి కప్ క్రికెట్ పోటీలు ఉత్కంఠభరింతగా సాగుతున్నాయి. గురువారం మూడవరోజు టాస్ గెలిచిన జట్లు విజయం సాధించాయి. ఉదయం యువన్ ఫావర్ట్స్ లెవెన్ హైదరాబాద్, సిక్కోలు సీతాస్ వైజాగ్ మధ్య పోటీ ఉత్కంఠభరితంగా సాగింది. సిక్కోలు జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన యువన్ పావర్ట్స్ హైదరబాద్ జట్టు నిర్ణీత 20ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసింది. అనంతరం బ్యాంగ్‌కు దిగిన సిక్కోలు జట్టు 13.3 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి 177 పరుగులు చేసి విజయం సాధించింది.

సాయంత్రం జరిగిన పోటీలలో సౌత్‌జోన్ సీసీ చెన్నై, కోకా ఇన్‌ఫ్రా లెవెన్ హైదరబాద్‌జట్లు మధ్య పోటీ జరిగింది. టాస్ గెలిచిన చెన్నై జట్లు బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణిత 20 ఓవర్లలో 5 వి కెట్లు కోల్పోయి 160 పరుగులు సాధించింది. అనంతరం బ్యాంటింగ్‌కు దిగిన కోకా ఇన్‌ఫ్రా హైదరబాద్ జట్టు 19.2 ఓవర్లలో 140 పరుగులకు ఆలౌట్ ఓటమి పాలయింది. ఉదయం సాయంత్రం జరిగిన పోటీలలో గెలుపొందిన సిక్కోలు సీతాస్ వైజాగ్ జట్టు, సౌత్ జోన్ సీసీ చెన్నై జట్లు సెమి ఫైనల్స్‌కు చేరాయి.

శుక్రవారం ఉదయం తండర్‌బోల్ట్ తిరుపతి, మెగావరియర్స్ విజయవాడ మధ్య, సాయంత్రం లైన్స్ క్లబ్ క్రికెట్ బెంగుళూర్, ప్రసాద్ జెడ్‌ఫోర్స్ హైదరబాద్ జట్ల మధ్య పోటీ జరుగుతుందని రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి , కోశాధికారులు యడ్లపల్లి నరసింహారావు, కారుసాల ప్రతాప్ తెలిపారు.

రసవత్తరంగా క్రికెట్ పోటీలు

పంగులూరు, జనవరి 11: మండలంలోని కొండమంజులూరులో జరుగుతున్న టీ20 ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు గురువారం రసవ త్తవరంగా సాగాయి. గురువారం ఉదయం జార్ఖండ్, బెంగులూరు జట్ల మధ్య జరిగిన పోటీలో టాస్ గెలిచిన బెంగుళూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకొంది. ముందుగా బ్యాటింగ్ చేపట్టిన జార్ఖండ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 191 పరుగులకు ఆలౌట్ అయింది. 192 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన బెంగుళూరు జట్టు 12.5 ఓవర్లలో 126 పరుగులకు ఆలౌట్ అయి ఓటమి పాలయింది. జార్ఖండ్ జట్టు క్రీడాకా రుడు హరీష్‌రెడ్డి 3 ఓవర్లకు 26 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీసుకుని మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. సాయంత్రం జరిగిన పోటీ లో బుల్స్ ఒంగోలు, బళ్ళారి జట్లు తలపడగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బళ్ళారి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 255 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన బుల్స్ ఒంగోలు జట్టు 134 పరుగులకే ఆలౌట్ అయి ఓటమి పాలయింది. బళ్ళారి జట్టు క్రీడాకారుడు తహ 47 బంతులలో 16 ఫోర్లు, 5 సిక్స్‌లతో 104 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

శుక్రవారం ఉదయం కేరళ, గుజరాత్ జట్లు, సాయంత్రం ఆంధ్రప్ర దేశ్, తెలంగాణ జట్టు తలపడనున్నాయని పోటీల నిర్వాహకులు కరణం స్వామి తెలిపారు.

హరివిల్లు.. సిరిజల్లు..

వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్




ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం విజయవాడలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ

గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి


పరిశీలన : ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

ద్వితీయ బహుమతి విజేతలు

ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే.

- ఏ.సునీత, గుంటూరు జిల్లా

రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.

- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా

పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.



విజేతలు వీరే..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ద్వితీయ బహుమతులు అందుకుంటున్న ఏ.సునీత (గుంటూరు), కె.ఉమాదేవి (అనంతపురం), కె.రాధ (తమిళనాడు), కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆద్రిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), సీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక)